ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

ఆగస్టు 2009

వెల : రూ. 10



సుబోధ

భగవద్దర్శనానికి తీవ్రపరితాపం ఒక్కటే నిశ్చితమైన మార్గం.

జటిలుడనే బాలుడు ఉండేవాడు. అతడు పాఠశాలకు ఒంటరిగా ఒక చిట్టడవి గుండా పోవలసి వచ్చేది. అడవి దాటడానికి ఆ బాలుడు భయపడేవాడు. ఈ మాట తల్లితో చెప్పగా, ఆమె ఇలా అంది: "నాయనా! నీకు భయం వేసినప్పుడల్లా కృష్ణుణ్ణి పిలువు". "కృష్ణుడు ఎవరమ్మా!" అని బాలుడు అడిగాడు. "కృష్ణుడు నీ అన్న" అని తల్లి చెప్పింది. ఆ తరువాత జటిలుడు అడవిని దాటుతూ "ఓ అన్నా! కృష్ణా! నువ్వెక్కడున్నావు? నాకు భయంగా ఉంది. వచ్చి నన్ను కాపాడు" అని అరిచాడు.

అంత విశ్వాసంతో మొరపెడుతున్న ఆ బాలుడి మొర ఆలకించకుండా, రక్షించకుండా కృష్ణుడు ఉండగలడా? కృష్ణుడొక చిన్నబాలుడి రూపంలో వచ్చి "తమ్ముడూ! వచ్చాను. నేను ఉండగా నీ కెందుకు భయం? నాతో రా! నేను నిన్ను పాఠశాలకు తీసుకువెళతాను" అన్నాడు. అలా ఆ బాలుణ్ణి పాఠశాల వద్ద విడిచిపెట్టి, "నువ్వు నన్ను పిలిచినప్పుడల్లా నేను వస్తాను, భయపడవద్దు" అని కృష్ణుడు అభయం ఇచ్చాడు.

నిజమైన నమ్మకం, భగవత్పరితాపం యొక్క మహిమ అలాంటిది. ❖

('శ్రీరామకృష్ణ బోధామృతం' నుంచి)

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029
ఫోన్: 040–2766 7799, 2763 3936
E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

సురభి

మాతృదేవి బృందావనంలో ఉన్నప్పుడు ప్రతిరోజూ రాధారమణుని దర్శించేవారు. ఒకరోజు మాతృదేవి రాధారమణుని ఆలయానికి వెళ్ళి కన్నీటితో "ఓ భగవంతుడా! ఇతరులలో తప్పులు చూసే స్వభావాన్ని నా నుండి పూర్తిగా తొలగించు!" అంటూ హృదయపూర్వకంగా ప్రార్థించారు.

ఈ విషయమై కాలాంతరంలో మాతృదేవి ఇలా అన్నారు: "ఇతరులలో తప్పులు చూసే స్వభావం నాకు కూడా మునుపు ఉండేది. ఆ స్వభావం తొలగిపోవాలని భగవంతుణ్ణి ఎంతో ఆర్తితో ప్రార్థించాను. అప్పటి నుంచి ఇతరుల తప్పులను చూసే స్వభావం నాలో పూర్తిగా తొలగిపోయింది. ఒక వ్యక్తికి మనం వెయ్యి సహాయాలు చేసి ఉండవచ్చు. కానీ పొరపాటుగా మన వల్ల ఒకసారి చెడు జరిగితే వెంటనే అతడు ఆగ్రహించి ముఖం తిప్పుకుంటాడు. ఇతరులలో తప్పులు మాత్రమే చూడడం మనిషి నైజం. కానీ ఇతరులలోని సుగుణాలను కూడా చూసి మెచ్చుకునే స్వభావాన్ని మనం అలవరచుకోవాలి. మానవ జీవితంలో తప్పులు జరగకుండా ఉండవు. కానీ అతడి తప్పులను మాత్రమే ఎప్పుడూ చూస్తూ ఉండకూడదు. నిర్విరామంగా ఇతరులలో తప్పులు చూసే వ్యక్తికి ఎక్కడ చూసినా తప్పులే కనిపిస్తాయి". ❖

(స్వామి యోగానంద స్మృతుల నుంచి)

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 66 సంచిక: 8 ఆగష్టు 2009

ఘనసంసారాహతులగు, జను లాకాంక్షింపఁ గడు నశక్యం బగు శో
భనము సమక్షంబున నహి, గనియెం దామసుఁడు రోషకలితుం డయ్యున్.

సంసార భారం చేత క్రుంగిపోయిన జనులు కోరడానికి కూడా సాధ్యం కాని పరమ శుభం నీ పాదస్పర్శ. అటువంటి భాగ్యాన్ని క్రోధం, రోషం నిండిన సర్పరాజు కాళియుడు పొందగలిగాడు. ఇది నీ సాన్నిధ్య మహిమ!

('పోతన భాగవతం' దశమ స్కంధం-పూర్వభాగం నుంచి)

లోపలి పేజీల్లో...

4
సంపాదకీయం
కైవల్యపదాన్నిచ్చే కాళియమర్దనం!



10
దేవీ వైభవం

6
గోరుముద్ద
ధ్యానం నేర్పుతారా?

13
ధీరవాణి
సర్వత్రా ఆ సర్వేశ్వరుడే!

7
శ్రీరామకృష్ణులే శ్రీకృష్ణుడు!

14
పరిప్రశ్న

8
పరమహంస మాట
పరమార్థానికి బాట

15
ఆచారవ్యవహారాలు-అంతరార్థాలు
శుభాలనిచ్చే శంఖం

9
పరమేశ్వరుని పరిరక్షణలో...
ఎవరిచ్చినా, ఏదిచ్చినా బ్రహ్మార్పణమే!

16
బొమ్మల కథ
గణపతి చేసిన శివ కేశవ ప్రతిష్ఠ



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'లో సభ్యులుగా చేరి ధనదానం చేయాల్సిందిగా మనవి. సభ్యుల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు	చిరునామా	రూ.
రాజ పోషకులు :	శ్రీమతి పి. జ్యోతి, శ్యామలానగర్, గుంటూరు		7,000
పోషకులు :	శ్రీమతి పోణంగి భుజంగేశ్వరి, మియాపూర్, హైదరాబాద్ (కీ।।శే।। కాళ్ళకూరి శతకీర్తి జ్ఞాపకార్థం)		1,400
" " :	శ్రీ పోణంగి బాబూరావు, మియాపూర్, హైదరాబాద్ (కీ।।శే।। పోణంగి వీరభద్రమ్మ జ్ఞాపకార్థం)		1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

ప్రియ భక్తులారా!

యువతరంలో ఆత్మవిశ్వాసాన్ని నింపే యువనాయక స్వామి వివేకానంద స్ఫూర్తివచనాలతో వెలువడుతున్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకూ, కళాశాలలకూ అందించాలని సంకల్పించాం.

శ్రీరామకృష్ణుల, స్వామి వివేకానందుల సందేశాల ఆవశ్యకతను గురించి సుభాష్ చంద్రబోస్ ఒక సందర్భంలో చెబుతూ, "శీలనిర్మాణానికి రామకృష్ణ - వివేకానంద సాహిత్యం కన్నా ఉన్నతమైన సాహిత్యం వేరొకటి లేదు" అని అన్నారు.

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయడానికి మీ ఆర్థిక సహాయాన్ని కోరుతున్నాం. ఈ పథకం కింద రూ. 1500 మొత్తాన్ని జీవిత చందా (20 సంవత్సరాలకు) కట్టినట్లయితే మీరు సూచించిన, లేదా మేము ఎంపిక చేసిన ఒక పాఠశాల/కళాశాలకు 20 ఏళ్ళ పాటు పత్రికను మీ పేరున పంపుతాం. చందాదారుని పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

మీ చందాను ఎమ్.ఓ. / డి.డి./ చెక్కు రూపంలో Ramakrishna Math, Hyderabad పేరున తీసుకొని, Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029 చిరునామాకు పంపవలెను.

స్వామీజీ ఆదర్శాలకు అనుగుణంగా యువతరాన్ని తీర్చిదిద్దడంలో 'శ్రీరామకృష్ణ ప్రభ' చేపట్టిన ఈ పథకానికి చేయూతనందించగలరని ఆశిస్తున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో

స్వామి జ్ఞానదానంద

అధ్యక్షులు

ముఖచిత్రం : శ్రీకృష్ణ లీలలు - *(ఎడమ దిగువ నుంచి సవ్య దిశలో)* కేశి సంహారం, యశోదమ్మకు బ్రహ్మాండ దర్శనం, నవనీత చోరత్వం, గోవర్ధనోద్ధరణం, కాళియమర్దనం, యమళార్జున భంజనం, కంస సంహారం

ADVERTISEMENT TARIFF

	MULTI COLOUR	B & W
Fourth Cover	Rs.25,000	-
Second Cover	Rs.20,000	-
Third Cover	Rs.20,000	-
Inside Full Page	Rs.15,000	10,000
Inside Half Page	Rs.10,000	5,000

చందా వివరాలు

		ఇండియాలో	విదేశాలలో
విడి ప్రతి	:	రూ. 10	-
ఒక సంవత్సర చందా	:	రూ. 100	$ 25
మూడు సంవత్సరాలకు	:	రూ. 280	$ 55
ఐదు సంవత్సరాలకు	:	రూ. 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	:	రూ. 1500	$ 365

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా : Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

లోపలి పేజీల్లో...

18
విద్యాప్రదాత వినాయకుడు



27
మనసా... నీ పయనమెటు?

19
సూర శ్యాముని లీలలు

29
ముందుకు సాగిపో!

20
ఓ మహాత్యాగి ఆత్మకథ
(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

31
మహనీయుల జీవితాల్లో మధురఘట్టాలు
భరతమాత చరణ సేవలో వీరసింహం

22
మహా పుణ్యప్రదం
మహాత్ముల సంస్మరణం

33
స్వాధ్యాయం

24
ప్రాచీన గాథలు: జీవన వికాసం
భగవద్గీత - వ్యక్తిత్వ వికాసం

34
నా జీవితంలో స్వామి వివేకానంద
'విశ్వాసం.. విశ్వాసం' అదే స్వామీజీ సందేశం!

26
యువవాణి
నవతరం సందేహాలకు సమాధానాలు

35
నిత్య సంతోషం

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు పైన చిరునామాకు కుడి భాగంలో మీ చందా గడువు ముగిసే నెల వ్రాసి ఉంది. సకాలంలో సొమ్ము చెల్లించి, చందా పొడిగించుకోండి. 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆధ్యాత్మిక వెలుగులు మీ ఇంట నిరంతరాయంగా ప్రసరించేలా సహకరించండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నెంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- పత్రిక ప్రతీ నెల 26వ తేదీన పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపు చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

- సర్క్యులేషన్ మేనేజర్

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు.

- సంపాదకులు

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH

Domalguda, Hyderabad - 500 029. Andhra Pradesh
Phone No: 040 - 2766 7799, E-mail : sriramakrishnaprabha@gmail.com

సంపాదకీయం

కైవల్యపదాన్నిచ్చే కాళియమర్దనం!

సంసారంలో ఉంటూ మనస్సుని భగవంతునిపై నిలపడం కష్టతరం కాబట్టి అన్ని విధులనూ విడిచిపెట్టి సాధన చేసిన వారికే భగవద్దర్శనం సాధ్యమని సామాన్యుల అభిప్రాయం. సంసారంలో ఉంటూనే భగవల్లాభం పొందిన భక్తుల సంఖ్య ఆధ్యాత్మిక చరిత్రలో అసంఖ్యాకం. గృహస్థులు సంసారంలో ఉంటూనే మానసికంగా నిస్సంగులై తమ కర్తవ్యాల్ని నిర్వర్తించాలని శ్రీరామకృష్ణులు ఉద్ఘాటించారు.

సంసారాన్ని సాగిస్తూ భగవంతుణ్ణి పొందడానికి బురదలో ఉంటూనే బురద అంటకుండా నిగనిగలాడే చేపలా, నీటిలో ఉంటూనే ఒక్క నీటి బొట్టు కూడా అంటని తామరాకులా ఉండాలని శ్రీరామకృష్ణులు బోధించారు. అయితే బురదలో ఉంటూ బురద అంటకుండా, నీటిలో ఉంటూ నీరు అంటకుండా ఉండడం ఎలా సాధ్యమనే ప్రశ్న ఉదయించక మానదు. అది ఎలా సాధ్యమవుతుందో శ్రీరామకృష్ణులే సోదాహరణంగా ఇలా వివరించారు:

'వడ్రంగి భార్య రోట్లో అటుకులు వేసి ఒక చేత్తో రోకలి పట్టుకొని దంపుతూ ఉంటుంది. రెండో చేత్తో బిడ్డకు పాలిస్తూ, అటుకుల్ని కలియబెడుతుంటుంది. అంతేకాకుండా అటుకులను కొనడానికి వచ్చిన వారితో బేరసారాలు చేస్తుంది. ఇలా ఆమె ఇన్ని పనులు చేస్తున్నా, అటుకుల్ని దంచుతున్నప్పుడు రోకలి తన చేతి మీద పడకుండా చూసుకోవడంలో మనస్సును అప్రమత్తంగా ఉంచుతుంది'.

అలాగే నిత్య జీవితంలో మన విధుల్ని నిర్వర్తిస్తూ కూడా సర్వదా భగవంతునిపై మనస్సును లగ్నం చేయాలి. అప్పుడు సంసారంలో ఉన్నా సంసారం అంటకుండా భగవంతుణ్ణి పొందవచ్చు.

ఎన్నో జన్మల సుకృత ఫలం వల్ల పొందిన అరుదైన ఈ మానవ దేహం ముక్తికి మూల సాధనం. ముక్తిని పొందడానికి ఒక అపూర్వ అవకాశాన్నిచ్చిన భగవంతుణ్ణి మరచి మోహాంధకారంలో మునిగి, రాగద్వేషాలు, అసూయా అహంకారాలతో వ్యవహరిస్తూ మానవజన్మ పరమార్థాన్ని మరచిపోతున్నాం.

సకల సౌకర్యాల్నీ సమకూర్చిన భగవంతుణ్ణి స్మరిస్తూ జీవనం సాగించకుండా, అహంకార పూరితుడై మనిషి తన వినాశనానికి తానే ఎలా కారకుడవుతాడో భాగవతంలో శ్రీకృష్ణుని లీలా వైభవాన్ని తెలియజేసే 'కాళియమర్దనం' ఘట్టాన్ని మన జీవితంతో అన్వయించుకోవచ్చు.

అపాయాన్ని కలిగించే అసుర వృత్తి : గరుత్మంతుని నుంచి ఎలాంటి అపాయమూ కలుగదని సౌభరి మహర్షి అభయం ఇవ్వడం వల్ల కాళియుడనే సర్పరాజు కాళింది మడుగులో తలదాచుకొన్నాడు. ఈ కాళింది మడుగులో తనను ఎదిరించే వారెవ్వరూ లేరనీ, తానే ఈ రాజ్యానికి మహారాజు అనీ అహంకారంతో అంధుడై ప్రవర్తించడం మొదలుపెట్టాడు. కాళియుడు మొత్తం మడుగులోని జలాన్ని విషపూరితం చేయసాగాడు. మడుగులోని జంతువులూ, ఆ నీళ్ళు త్రాగిన మనుష్యులూ ప్రాణాలను కోల్పోయేవారు.

సంసారమే కాళింది మడుగు. అందులో జీవిస్తున్న కాళియుడే మనిషి. సంసారమనే జనన మరణ చక్ర భ్రమణం నుంచి బయట పడడానికి భగవంతుడు ఇచ్చిన ఒక అపూర్వ అవకాశం ఈ మానవ జన్మ. కాళియునికి గరుత్మంతుని నుంచి ప్రాణహాని కలుగకుండా క్షేమంగా జీవించడానికి సౌభరి మహర్షి అభయమిచ్చాడు. అలాగే మనం సంసారమనే మడుగులో కూరుకు పోకుండా మృత్యువు నుంచి బయటపడి అమరత్వాన్ని పొందడానికి భగవంతుడు మానవ జన్మ ప్రసాదించాడు. ఈ మానవ జన్మ ఆధారంగా ఆనందామృతాన్ని గ్రోల వలసిన మనం మోహం అనే బురదలో కూరుకుపోవడం వల్ల విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతున్నాం. మదమాత్సర్యాలనే విషాన్ని కక్కుతూ పరిసరాల్ని కలుషితం చేస్తున్నాం; అందరికీ హాని కలిగిస్తున్నాం.

మదాన్ని అణచిన మాధవుడు: కాళింది మడుగులో ఉన్న కాళియుడు అన్ని జీవులకూ హానికరంగా మారాడు. అతణ్ణి అంతమొందిస్తే కానీ రేపల్లె వాసులకు సుఖశాంతులుండవు అని తలచిన అచ్యుత కృష్ణుడు కాళియుని విషపు కోరలను విరిచి, పడగపై తాండవం చేస్తూ అతని మదాన్ని అణచివేశాడు. అప్పుడు కాళియుడు తనను క్షమించి రక్షించాల్సిందిగా శరణాగతి భావంతో చిన్ని కృష్ణుణ్ణి వేడుకున్నాడు. కాళియునిలో కృష్ణుని యందు సంపూర్ణ

శరణాగతి భావం కలగడం వల్ల అతనిలోని అభిమాన అహంకారాలనే అసుర గుణాలన్నీ మటుమాయమైపోయాయి.

మనం కూడా స్థాన, ధన, విద్య, అధికార బలగర్వాలతో మంచీ చెడుల మధ్య విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి ఇతరులను హింసిస్తుంటాం. అలాంటప్పుడు భగవంతుడే ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఎన్నో గుణపాఠాలను నేర్పుతుంటాడు. మనకు తగిలిన ఎదురుదెబ్బల తాకిడితో మన తప్పులను తెలుసుకొని వివేకంతో వ్యవహరిస్తే అసుర గుణాల నుంచి విముక్తుల మవుతాం. ఎప్పుడైతే మనలోని అభిమాన, అహంకారాలు అణుగుతాయో అప్పుడే భగవంతుని యందు సంపూర్ణ



శరణాగతి భావం కలుగుతుంది. అప్పుడు భగవంతుని కృపకు పాత్రులమవుతాం.

సంపూర్ణ శరణాగతి భావం కలిగినప్పుడు మనలోని వాసనలన్నీ తొలగించే బాధ్యతను ఆ భగవంతుడే వహిస్తాడు.

తదర్పితాఖిలాచారస్సన్ కామక్రోధాభిమా
నాదికం తస్మిన్నేవ కరణీయమ్ *(నారద భక్తిసూత్రాలు - 65)*

'తన సర్వస్వమూ భగవదర్పణ గావించిన వాడు, అతని కోర్కెలనూ, కోపాలనూ, అభిమాన దంభాలనూ కూడా ఆయనకే వదలాలి. వాటి బాధ్యత కూడా భగవంతునిదే'.

మనఃఫలకంపై మాధవుని రూపం: సంపూర్ణ శరణాగతి పొందిన కాళియునితో శ్రీకృష్ణుడు 'కాళియుడా! ఇప్పుడు కాళింది మడుగు వీడి, నీ స్వస్థలమైన రమణక ద్వీపానికి వెళ్ళు' అని చెప్పాడు. శ్రీకృష్ణునితో 'గరుత్మంతుని వల్ల నాకు ప్రాణహాని పొంచివుంది' అని కాళియుడు విన్నవించుకోగా 'కాళియుడా! ఇక మీదట ఎవరి నుండీ నీకు అపాయం వాటిల్లదు. నీ శిరస్సుపై నా పాద ముద్రలను చూసి గరుత్మంతుడు నీకు హాని తలపెట్టడు' అని అభయమిచ్చాడు శ్రీకృష్ణుడు. అనంత కృష్ణుని పాద ముద్రలు తన శిరస్సుపై ధరించిన కాళియుడు భయం వీడి, తన నిజ ధామానికి వెళ్ళి ఆనందంగా జీవితాన్ని కొనసాగించాడు.

భగవంతుణ్ణి శరణువేడినప్పుడు మనలోని దుర్గుణాలను శ్రీహరి హరింపజేసి, మనల్ని పవిత్రుల్ని చేస్తాడు. అలాంటి పవిత్రమైన మనస్సులో భగవంతుని దివ్య మంగళ రూపాన్ని ప్రతిష్ఠించి, ఆయన్ని ధ్యానిస్తూ, స్మరిస్తూ ఉంటే సంసారంలో అన్ని విధుల్నీ నిష్కామ భావంతో నిర్వర్తించడం సాధ్యమవుతుంది. మనస్సు భగవన్మయమైనప్పుడు ఈ ప్రపంచంలో మనకు ఎవరి నుండీ ఎలాంటి హానీ కలుగదు. సదా భగవంతుని చింతనలోనే చరించినవారు ఆయన పదసన్నిధిని తప్ప అన్యమేదీ కాంక్షించరు.

ఒల్లరు నిర్జరేంద్రపద మొల్లరు బ్రహ్మపదంబు నొందగా
నొల్లరు చక్రవర్తిపద మొల్లరు సర్వరసాధిపత్యము
నొల్లరు యోగసిద్ధి మతి యొందు భవంబుల నొందనీని నీ
సల్లలితాంఘ్రి రేణువుల సంగతి నొందిన ధన్యు లెప్పుడున్

(పోతన భాగవతం- దశమ స్కంధం- 678)

'అతి మనోహరములైన నీ పాదరేణువుల స్పర్శ పొందిన ధన్యులు దేవేంద్ర పదవిని ఇష్టపడరు. బ్రహ్మపదవిని గానీ, చక్రవర్తి పదవిని గానీ కోరరు. వరుణుని పదవిని గానీ యోగసిద్ధిని గానీ కాంక్షించరు. అలాంటి నీ పాదరేణువుల స్పర్శ ఏ జన్మలోనూ ఎవరూ పొందలేనిది (అత్యంత దుర్లభమైనది).'

శ్రీకృష్ణుని పాద ముద్రలు ధరించిన కాళియుడు నిర్భయంగా తన నిజధామానికి చేరుకున్నట్లు మనం కూడా భగవంతుని రూపాన్ని మన మనస్సులో ముద్రించుకొని, జనన మరణాలకు అతీత స్థితి అయిన 'అమరధామం' చేరుకోవడానికి ప్రయత్నిద్దాం. ❖

ధ్యానం నేర్పుతారా?

- స్వామి సుప్రియానంద

ఈనాడు ధ్యానం చాలా ప్రాచుర్యం పొందిన అంశం. ధ్యానం ఎలా చేయాలండీ? ధ్యానం చెయ్యడం నేర్పుతారా? ఇవి రామకృష్ణ మఠాల్లో స్వాములు ఎదుర్కొంటున్న ప్రశ్నలు. దీనికి కారణం "ఎంతో మంది ఆధ్యాత్మిక గురువులు ఒక వారం రోజుల్లో ధ్యానం నేర్పుతాం, అంత సమయం ఇవ్వలేని వారికి మూడేమూడు రోజుల్లో ధ్యానం నేర్పుతాం" అని చెప్పడమే!

ధ్యానం ఎలా చేయాలో తెలుసుకునే ముందు, ధ్యానం ఎందుకు చేయాలి? అన్న ప్రశ్న మనలో ఉదయించాలి. మాటలు రాని పసిపిల్లవాడు ఏడ్చినప్పుడు, తల్లి బుజ్జగిస్తూ మొట్టమొదట పిల్లవాడు ఎందుకు ఏడుస్తున్నాడో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఆ తరువాతే ఏం చేయాలి? ఎలా చేయాలి అన్న ఆలోచన.

ఒక అధ్యాపకుడు తన విద్యార్థులకు సైన్సులో ఒక ప్రయోగం నేర్పించారు. పరీక్షలో దాని గురించి "అది ఏమిటి? ఎలా జరుగుతుంది?" అని ప్రశ్నించారు. దానికి సమాధానంగా ఒక విద్యార్థి "ఏమిటంటే ఎలా చెప్పను? ఎలా అంటే ఏమి చెప్పను" అని వ్రాశాడు. ఎందుకా ప్రయోగం చేయాలి అన్న జ్ఞానం లేకపోవడం వల్లనే ఆ విద్యార్థి ఏమిటి? ఎలా? అన్న అంశాలను మర్చిపోయాడు.

ఒక పెద్దమనిషిని ధ్యానం ఎందుకు నేర్చుకోవాలను కుంటున్నారని అడిగినప్పుడు "ధ్యానం చేస్తే రక్తపోటు (blood pressure) తగ్గుతుందని డాక్టరు గారు చెప్పారని బదులిచ్చాడు. కాబట్టి ఎందుకు అన్న ప్రశ్న మన అంతరంగంలో ఉదయించాలి. అది మన సొంత ఆలోచనవ్వాలి.

పతంజలి మహర్షి యోగానికి అంగాలు ఎనిమిది అని పేర్కొన్నారు. అవి 'యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి'.

యమ: అహింస, సత్యవాక్పాలన, దొంగతనం చెయ్యక పోవడం, బ్రహ్మచర్యం, ఎవరినీ యాచించకపోవడం.

నియమ: బాహ్యాభ్యంతర శుద్ధి, దొరికిన దానితో తృప్తి, తపస్సు, వేదాధ్యయనం, భగవద్ధ్యానం.

ఆసన: కాసేపు ఒక చోట నిలకడగా కూర్చోగలగడం.

ప్రాణాయామ: శ్వాసను లయబద్ధం చేయడం. లయ బద్ధంగా ఉండే శ్వాస మనస్సును ప్రశాంత పరుస్తుంది.

ప్రత్యాహార: బాహ్య ప్రపంచం లోని వస్తువులు – పదార్థాల నుండి ఇంద్రియ అవయవాలను మరల్చి అంతర్ముఖం కావించడం.

ధారణ: ఒక వస్తువుపై మనస్సును స్థిరంగా ఉంచడం.

ధ్యానం: ఏకాగ్రం చేసిన వస్తువుపై అవిచ్ఛిన్న ధారగా చేసే భావనా ప్రవాహమే ధ్యానం.

యమ నియమాలు మొదటి సోపానాలు. వీటిని మనం ఆచరిస్తున్నామా అని గమనించాలి. సత్యవాక్పాలన పాటిస్తున్నామా, దొరికిన దానితో సంతృప్తికర జీవనం గడుపుతున్నామా అని ఆలోచించుకోవాలి.

మందిరంలో భజన జరుగుతున్నప్పుడు కొంతమంది భక్తులు బయట 'ఇష్టాగోష్ఠి' జరుపుతారు. కాసేపు కూడా కుదురుగా కూర్చోలేనప్పుడు ఆసనసిద్ధి ఎలా లభిస్తుంది? ఈ విధంగా ఆరుమెట్లు ఎక్కకుండా ఒక్కసారిగా ధ్యానం చేయబోవటం ఎంత వరకు సమంజసం? అది సాధ్యమవుతుందా? ఆలోచించండి. ❖

పండుగలు - పర్వదినాలు

ఆగష్టు - 2009

01	శనివారం	:	ఏకాదశి
05	బుధవారం	:	స్వామి నిరంజనానంద జయంతి
13	గురువారం	:	శ్రీకృష్ణ జయంతి
16	ఆదివారం	:	ఏకాదశి
19	బుధవారం	:	స్వామి అద్వైతానంద జయంతి
23	ఆదివారం	:	వినాయక చతుర్థి
31	సోమవారం	:	ఏకాదశి

సెప్టెంబరు - 2009

13	ఆదివారం	:	స్వామి అభేదానంద జయంతి
15	మంగళవారం	:	ఏకాదశి
18	శుక్రవారం	:	స్వామి అఖండానంద జయంతి
28	సోమవారం	:	విజయదశమి - శాంతిజల్ (సాయంత్రం హారతి తర్వాత)
29	మంగళవారం	:	ఏకాదశి

శ్రీరామకృష్ణులే శ్రీకృష్ణుడు!

\- స్వామి జ్ఞానదానంద

స్వామి అంబికానందజీ తమ తండ్రి నవగోపాల్‌ఘోష్, శ్రీరామకృష్ణునిలో శ్రీకృష్ణుణ్ణి గాంచిన వైనాన్ని ఇలా వివరించారు:

"మా ఇల్లు కలకత్తాలోని బాదుర్‌బగాన్‌లో ఉండేది. ఒకమారు మా తండ్రి గారు శ్రీరామకృష్ణుల్ని మా ఇంటికి ఆహ్వానించారు. ఒక ప్రఖ్యాత గాయకుడు సంకీర్తన చేస్తుండగా గురుదేవులు హఠాత్తుగా లేచి గాయకుడు ఉన్న దగ్గరకు వచ్చి వారి ప్రక్కన చేతిలో మురళి పట్టుకుని శ్రీకృష్ణునిలా నిలబడ్డారు. ఆ దృశ్యం అత్యద్భుతంగా ఉంది. ఇతర భక్తులందరూ గురుదేవుల్ని చుట్టుముట్టి, సంకీర్తన చెయ్యడం మొదలుపెట్టారు. మా నాన్నగారు పువ్వులదండ ఒకటి పెద్దది తెచ్చి గురుదేవుల మెడలో వేశారు.

సంకీర్తన ముగిశాక గురుదేవులు క్రమంగా భావపారవశ్య స్థితి నుండి సహజ స్థితికి వచ్చారు. మా తండ్రి గారికి గురుదేవుల వదనంలో దీప్తిమంతమైన కాంతి కనపడింది. ముందు ఆయన ఇది తన భ్రమ అని తలచి, కళ్ళను నీటితో కడుక్కొని వచ్చారు. అప్పుడు కూడా అదే కాంతి కనపడింది".

నవగోపాల్ ధర్మపత్ని నిస్తారిణీఘోష్ శ్రీరామకృష్ణుల గురించి తమ అనుభవాన్ని ఇలా వివరించారు: "గురుదేవులు ఒకరోజు మా ఇంటికి వచ్చారు. వారిని చూడడానికి చాలా మంది భక్తులు వచ్చారు. గురుదేవులు రావడంతోనే తిన్నగా మేడ మీదికి వచ్చి నాతో మాట్లాడుతూ కాసేపు కూర్చున్నారు. అప్పట్లో మా పూజ గదిలో కృష్ణుడి విగ్రహం ఉండేది; నేను గురుదేవులతో "నాకు కృష్ణుణ్ణి చూడాలని ఉంది" అని చెప్పాను. వెంటనే వారు సరిగ్గా కృష్ణుడి భంగిమలో సమాధి స్థితికి చేరుకున్నారు. వారిని ఆ స్థితిలో చూడగానే చుట్టూ ఉన్న భక్తులందరూ ఉన్నత చైతన్య స్థితికి చేరుకున్నారు. తరువాత గురుదేవులు "నీకు తృప్తిగా ఉందా?" అని నన్ను అడిగారు. నేను "కృష్ణుడితో పాటు జంటగా రాధను కూడా చూడాలని ఉంది" అన్నాను. గురుదేవులు చిరునవ్వుతో, "ఓ! దాని కోసం నువ్వు కాస్త వేచి ఉండాలి" అన్నారు."

ఒకమారు శ్రీరామకృష్ణులు, స్వామి విజ్ఞానానందతో "కృష్ణావతారంలో గోపబాలకులతోనూ, గోపికలతోనూ బృందావనంలో నేను ఆటలు ఆడాను" అన్నారు. ఆ సంగతులను స్వామి విజ్ఞానానంద ఈ విధంగా జ్ఞాపకం చేసుకున్నారు: "గురుదేవులు అలా అన్న సమయానికి నేనింకా కళాశాల విద్యార్థిని. వారు అన్నది నాకు అర్థం కాలేదు.

గురుదేవులు నా సంశయాన్ని గ్రహించి గోపికల కృష్ణ ప్రేమను వివరించారు: "గోపికల ప్రేమ నిష్కపటమైనదీ, దివ్యమైనదీ, కృష్ణుని మురళీరవం వినగానే వాళ్ళు తమ తమ భర్తలను సైతం వదిలిపెట్టి కృష్ణుణ్ణి వెతుకుతూ పరుగులు తీసేవారు. వాళ్ళు తమ మనస్సులనూ, శరీరాలనూ... సమస్తాన్నీ కృష్ణార్పణం చేశారు. భాగవతంలో శరత్ పౌర్ణమినాటి రాత్రి గోపికలతో కృష్ణుడు రాసలీల సలిపినట్లు వర్ణించారు. రాసలీల సమయంలో కృష్ణుడు సమాధి స్థితికి చేరాడు, గోపికలు కూడా భక్తి పారవశ్యంతో సమాధి గతులయ్యారు."

ఇలా చెబుతూ గురుదేవులు బాహ్యస్మృతి కోల్పోయి సమాధి స్థితికి లోనయ్యారు. నేను కూడా గోపికలతో కృష్ణుడు సలిపిన దివ్యలీలను గురించి ఆలోచిస్తూ, దివ్యమైన మానసిక స్థితికి లోనయ్యాను".

ఒకమారు గురుదేవులు దక్షిణేశ్వర్‌లో రామ్‌లాల్ (తమ అన్న కుమారుడు) తో "కృష్ణుడిలా పచ్చటి వస్త్రం ధరించాలని ఉంది" అన్నారు. అప్పుడు రామ్‌లాల్ ఒక కొత్త బట్ట తెచ్చి శ్రీరామకృష్ణులకు ఇచ్చాడు. ఆ వస్త్రం ధరించి కృష్ణుడి విశేషణాలను ఉచ్చరిస్తూ వారు సమాధిస్థితికి చేరారు.

అనేక మంది భక్తులు శ్రీరామకృష్ణులలో తమ ఇష్ట దైవమైన శ్రీకృష్ణుణ్ణి దర్శించారు, ఎన్నో అనుభూతులను పొందారు. శ్రీరామకృష్ణులు సాక్షాత్తూ శ్రీకృష్ణ అవతారతత్త్వమే అనడానికి పైన ఉదహరించిన సంఘటనలే నిదర్శనాలు. ❖

పరమహంస మాట పరమార్థానికి బాట

మన మనస్సుకు ఎప్పుడూ ఏదో ఒక ఆలంబనమంటూ ఉండాలి; లేకపోతే అది అశాంతికి లోనవుతుంది. లౌకిక ప్రపంచం పట్ల కలిగే నిరాసక్తత భగవంతుని పట్ల ఆసక్తికి దారి తీస్తుంది. ప్రేతాత్మవాదం పట్ల నిస్పృహ చెంది, నిరాసక్తుడైన నిరంజనుడు (స్వామి నిరంజనానంద) నిజమైన ఆధ్యాత్మికత కోసం అన్వేషిస్తూ దక్షిణేశ్వరం వైపు దారితీశాడు.

మొదటి సారిగా శ్రీ రామకృష్ణులను కలుసుకున్న తర్వాత, కొద్దికాలానికే మళ్ళీ ఆయనను కలుసుకోవాలని ఓ రోజు సాయంత్రం నిరంజనుడు దక్షిణేశ్వరం వెళ్ళాడు. ఆ సమయంలో శ్రీరామకృష్ణులు తన గదిలో చుట్టూ భక్తులు పరివేష్టించి ఉండగా కొలువు తీరి ఉన్నారు. అప్పుడాయన భగవంతుడి గురించీ, ఆయనను ఎలా సాక్షాత్కరించుకోవాలనే అంశం గురించీ ప్రసంగిస్తున్నారు. భక్తులు ఆయన చెప్పేదంతా శ్రద్ధగా వింటున్నారు. శ్రీరామకృష్ణులు నిరంజనుణ్ణి చూసిన వెంటనే అతని దగ్గరకు వచ్చి ఇలా హితవు చేశారు: "అబ్బాయీ! నువ్వు నీ మనస్సును భూతాల మీదా, ప్రేతాల మీదా లగ్నం చేస్తే, నువ్వు కూడా భూతానివే అయిపోతావు. అలా కాకుండా నీ మనస్సును భగవంతుడి మీద లగ్నం చేస్తే, నీ జీవితమంతా భగవన్మయమవుతుంది. మరి ఈ రెండింటిలో నీ కేది కావాలి?" అప్పుడు నిరంజనుడు, "నా మనస్సును భగవంతునికే అర్పిస్తాను" అని బదులు పలికాడు.

శ్రీరామకృష్ణుల ప్రేమపూర్వక బోధతో నిరంజన్ మహరాజ్(స్వామి నిరంజనానంద) తనను తాను సంపూర్ణంగా భగవంతునికి అర్పించుకొని ఆధ్యాత్మిక మార్గంలో అత్యున్నత స్థితికి చేరుకున్నారు. ❖

(ఆగస్టు 5, బుధవారం – శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన **స్వామి నిరంజనానంద జయంతి**)

దుఃఖాలు ప్రపంచపు అశాశ్వతత్వాన్ని అర్థమయ్యేలా చేస్తాయి. చిన్నతనంలో తల్లి మరణం, బాల్యంలో తండ్రి వియోగం, వృద్ధాప్యంలో భార్యావియోగం జీవితాన్ని శూన్యంగా మారుస్తాయి.

భార్యా వియోగ వేదనను భరించలేక గోపాల్ చంద్రఘోష్ (స్వామి అద్వైతానంద) తన స్నేహితుడు డా॥ మహేంద్ర పాల్ వద్దకు వెళ్ళాడు. మహేంద్ర శ్రీరామకృష్ణుల భక్తుడు. అందువల్ల దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులను దర్శిస్తే కొంత ఉపశమనం కలుగుతుందని సలహా ఇచ్చాడు.

1884 ఏప్రిల్‌లో గోపాల్ దక్షిణేశ్వరం వెళ్ళాడు. శ్రీరామకృష్ణులు గోపాల్‌కు దుఃఖోపశమనం కలిగేలా అతడి మనస్సును ప్రాపంచిక బంధాల నుంచి సమూలంగా వేరు చేసి, ఉన్నత స్థాయికి తీసుకెళ్ళారు. గోపాల్ ఈ ప్రపంచం ఎండమావిలోని నీటి లాగ అసత్యమనీ, దానికి సరియైన మందు వైరాగ్యమేననీ, దానితోనే దుఃఖాన్నీ ఎదుర్కొనగలననీ తెలుసుకున్నాడు.

స్వామి అద్వైతానంద శ్రీరామకృష్ణులతో తన ప్రథమ దర్శనం గురించి ఇలా గుర్తుచేసుకునే వారు: "అశాశ్వతమైన ప్రపంచం పట్ల గురుదేవుల మాటలు నా మనస్సులో చెరగని ముద్ర వేశాయి. రేయింబవళ్ళూ ఆయన గురించే ఆలోచించేవాణ్ణి. ఆయన వియోగం నాకు బాధ కలిగించేది. ఆయన సుందర వదనాన్ని మరువలేకపోయాను".

గురుదేవుల సున్నిత వచనాలు గోపాల్ మహరాజ్ (స్వామి అద్వైతానంద) మనస్సుని భగవదున్ముఖం చేశాయి. సుఖదుఃఖాలకు అతీతమైన స్థితిని పొందాలనే తపనను ఆయనలో ద్విగుణీకృతం చేశాయి. ❖

(ఆగస్టు 19, బుధవారం – శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన **స్వామి అద్వైతానంద జయంతి**)

పరమేశ్వరుని పరిరక్షణలో ...

స్వామి జపానంద స్వీయ అనుభవాలు -26

ఎవరిచ్చినా, ఏదిచ్చినా బ్రహ్మార్పణమే!

హిందూ మహాసముద్రం, బంగాళాఖాతం, అరేబియా సముద్రాల సంగమ స్థలమైన కన్యాకుమారి ఒక పవిత్ర తీర్థ స్థలం. స్వామి జపానంద అక్కడ ట్రావన్కూర్ రాజ్య అతిథిగృహంలో బస చేశారు. ధర్మపరాయణుడైన ఒక అధికారి సన్న్యాసికి వసతి సౌకర్యాలు కల్పించాడు. ఆయనకు భోజనం ప్రతీరోజూ ఒక బ్రాహ్మణ భక్తుడు తీసుకువచ్చేలా ఏర్పాటు చేశాడు. కానీ అతను తరచూ పౌరోహిత్యం పనుల ఒత్తిడి వల్ల సన్న్యాసికి భోజనం చాలా ఆలస్యంగా తీసుకొచ్చేవాడు. ఉపాహారం పన్నెండు గంటలకూ, మధ్యాహ్న భోజనం సాయంత్రం నాలుగు గంటలకూ తీసుకువచ్చేవాడు. ఒక్కోసారి భోజనం లేకుండా సన్న్యాసి ఆకలితోనే గడపాల్సి వచ్చేది. ఇన్ని అసౌకర్యాలు న్నప్పటికీ సన్న్యాసి మాత్రం ఎన్నడూ అసంతృప్తిని వ్యక్తపరచలేదు.

సన్న్యాసి నివసించే గదికి ఎదురుగా ఉన్న గదిలో ఓ వృద్ధ దంపతులు ఉండేవారు. వారు సన్న్యాసికి కలుగుతున్న అసౌకర్యాన్ని గమనించేవారు. వాళ్ళు సన్న్యాసితో ఎప్పుడూ మాటలు కలపడానికి ప్రయత్నించలేదు. ఒకరోజు ఆ వృద్ధుడు వచ్చి "స్వామీజీ! పన్నెండయినా ఈ రోజు మీకు ఉపాహారం రాలేదు. ఇంట్లో బ్రాహ్మణుడు ఒక్కడే సంపాదించే మనిషి. అతనికి ముసలి తండ్రి ఉన్నాడు. దేవాలయ పనులతో పాటు ఇంటి బాధ్యతల్ని కూడా అతడే చూసుకోవాలి. అతడు ఈ రోజు మీకు భోజనం ఎప్పుడు తీసుకు వస్తాడో తెలియదు కాబట్టి మీరు అనుమతిస్తే భోజనం మేము ఏర్పాటు చేస్తాం" అని సన్న్యాసితో అన్నాడు.

సన్న్యాసి సరే అన్నారు. దాంతో, ఆ వృద్ధుడు ఆనందం పట్టలేక పరుగున తన గదిలోకి వెళ్ళాడు. తన భార్య చేత ముందుగా కాఫీ తయారు చేయించి సన్న్యాసికి ఇచ్చాడు. వాళ్ళు అభిమానంగా కలిపి ఇచ్చిన కాఫీ సన్న్యాసి తాగారు.

అదయ్యాక వృద్ధురాలు సన్న్యాసికి ఒక పళ్ళెంలో నాలుగు ఇడ్లీలు, పచ్చడి వేసి ఇచ్చింది. అవి చాలా రుచిగా ఉన్నాయి. స్వామి వివిధ ప్రాంతాల ఆహార పద్ధతుల గురించి, వంటలు, రుచుల గురించి మాట్లాడుతూ తిన్నారు. అలా కబుర్లు చెబుతూ, ఏడో ఎనిమిదో ఇడ్లీలు తిని, నాలుగు కప్పుల కాఫీ కూడా తాగారు. సన్న్యాసి ఆకలి తీర్చినందుకు ఆ వృద్ధ దంపతుల ఆనందానికి అవధులు లేవు. ఆనందంతో వారి కళ్ళు చెమ్మగిల్లాయి.

వృద్ధుడు సన్న్యాసితో "మేము క్షత్రియులం. బ్రాహ్మణులు కానీ, సన్న్యాసులు కానీ మా చేతి వంట తినరు. వాళ్ళు మమ్మల్ని అంటరానివాళ్ళుగా చూస్తారు. స్వయంగా వండి తన చేతులతో ఎవరైనా సాధువుకు భోజనం వడ్డించాలనే నా భార్య చిరకాలపు కోరిక ఇన్నేళ్ళకు తీరినందు వల్ల అంతులేని ఆనందం పొందుతున్నాం" అన్నారు.

వారి మాటలు విన్న స్వామి జపానంద కూడా కన్నీళ్ళు కార్చారు. "సన్న్యాసి జాతి, కుల, మత భేదాలకు అతీతంగా

ఉండాలి. సన్న్యాసాశ్రమం స్వీకరించేటప్పుడు ఈ భేదాలన్నీ అగ్నికి ఆహుతి ఇస్తాం. మాకు భిక్షగా వచ్చిన ఏ పదార్థాన్నైనా 'బ్రహ్మార్పణం' అనుకొనే, భుజిస్తాం" అన్నారు. దాంతో, ఆ వృద్ధ దంపతులిద్దరూ చేతులు జోడించి, "అయితే స్వామీజీ! మీరు ప్రతి దినం మా ఇంట్లో భోజనం చేయండి" అని సన్న్యాసిని ప్రార్థించారు. ఆప్యాయతతో కూడిన వారి ఆతిథ్యానికి స్వామి జపానందజీ మనస్సు ద్రవించింది. ❖ **అనువాదం: శ్రీమతి జి.ఎస్. లక్ష్మి**

దేవీ వైభవం

ప్రవచనం: **శ్రీ సామవేదం షణ్ముఖశర్మ** విలేఖనం: **శ్రీమతి ఎన్. శేషు**

(...గత సంచిక తరువాయి)

స్వారోచిష మనువు కాలంలో సురథుడు అని ఒకరాజు ఉండేవాడు. రాజు చక్కగా పాలన చేస్తూ ఉంటే కొందరు మంత్రులు, శత్రువులు అతణ్ణి వంచించారు. శత్రువుల వల్ల, తన వారి వల్ల కూడా వంచితుడై ఆయన అరణ్యాల పాలయ్యాడు. అరణ్యంలో తిరుగుతూ మనోవేదనతో "ఎలా ఉండేవాణ్ణి, ఇలా ఒంటరిని అయిపోయాను, ఏమయి పోయాయి ఆ సంపదలన్నీ? ఏవి ఎప్పుడు ఉంటాయో, ఎప్పుడు పోతాయో తెలియవు. జ్ఞాని అయినవాడు ఉన్నప్పుడు అహంకరించడం, లేనప్పుడు దిగులుపడడం చెయ్యకూడదు" అని బాధపడుతుండగా ఒక ఆశ్రమం కనిపించిందట.

అది సుమేధ అనే మహాత్ముని ఆశ్రమం. సురథుడు ఆ ఆశ్రమంలోకి వెళ్ళాడట. ఆ ఆశ్రమం ప్రశాంత వాతావరణంతో నిండివుంది. ఆశ్రమంలోని తపస్వులు అతనికి ఆశ్రయమిచ్చారు కానీ అతనికి మనశ్శాంతి లేదు. మనం ఎక్కడ ఉన్నామన్నది కాదు, మనస్సు ఎక్కడ ఉన్నది అనేది ప్రధానం. సురథుడి ఆవేదన "అంత రాజ్యం ఎంత కష్టపడి సమీకరించాను! చతురంగ బలాల్నీ. అవన్నీ ఎలా ఉన్నాయో! నేను లేచిన వెంటనే నాకు జేజేలు చెప్పిన వందిమాగధులూ, సేవకులూ ఏం చేస్తున్నారో..." ఇలా సాగుతోంది. ఆశ్రమంలోని వారంతా ప్రశాంతంగా, ఆనందంగా ఉన్నారు. మోహం కారణంగా ఇతని మొహం ఒక్కటే దిగులుగా ఉంది.

కొద్ది రోజులకు అతనికి మరొక దిగులు ముఖం కనపడింది. అతని దగ్గరకు వెళ్ళి "నీ పేరేమిటి, ఎందుకలా దిగులుగా ఉన్నావు" అని అడిగాడట. "సమాధిర్నామ వైశ్యోహం" – "నా పేరు సమాధి, నేనొక వైశ్యుణ్ణి" అన్నాడట. "నువ్వెందుకిలా వచ్చావు" అని అడిగాడట. "నా పుత్రుల మీద ప్రేమతో వారికి వ్యాపారంలో మెళకువలన్నీ నేర్పాను. వారికి నా మీద నమ్మకం లేక నా భార్యతో కలసి నన్ను ఇంటి నుంచి తరిమివేశారు" అన్నాడు. ఏ మన్వంతరం అయినా మనుష్యుల స్వభావాలు మారవు. రాగాలూ ద్వేషాలూ ఎప్పుడూ ఒకటే. మనిషి అప్పుడూ ఈర్ష్యాసూయలతో మిడిసిపడ్డాడు, ఇప్పుడూ మిడిసిపడుతున్నాడు. లోకంలో ఇది సహజమే. 'పుత్రాదపి ధన భాజాం భీతిః'– ధనవంతులకు పుత్రుల వల్ల కూడా ప్రమాదమే అన్నారు శంకరుల వారు.

"ఎంత విభవము కలుగు అంతయును ఆపదని చింతించుటయే కదా చెడని జీవనము'' అన్నారు అన్నమాచార్య. సమాధితో "నువ్వు అక్కరలేదని తరిమికొట్టారు కనుక ఇక్కడ హాయిగా ఉండొచ్చు. ఇక దిగులెందుకు" అని సురథుడు అన్నాడు. "వాళ్ళ గురించి ఆలోచించకూడదనీ, అది మోహమనీ, అజ్ఞానమనీ నాకు తెలుసు. ఎన్ని తెలిసినా వాళ్ళ గురించి మర్చిపోవడం మాత్రం నాకు సాధ్యం కావడం లేదు'' అన్నాడట సమాధి. మోహం అనేది మనం వదుల్చుకుంటే వదిలేదా, మనం తగుల్చుకుంటే వచ్చిందా? ఎలా వచ్చిందో ఆలోచిస్తే, ఎలా పోతుందో తెలుస్తుంది!

ఇద్దరూ గురుస్వరూపుడైన సుమేధ దగ్గరకు వెళ్ళి "మోహమని తెలిసి కూడా, దాని నుండి ఎందుకు బయట పడలేక పోతున్నాం" అని అడిగారట.

"మనుజుల ప్రేమలు మబ్బుల మెరుపులు నిలకడ కలవని నమ్మకుమీ" అన్నారు. "తొలుకారు మెరపులు తోచిపోవు గాక మెలకువ చూడ అవి నిలచేనా అలివేలుల ప్రేమలు ఆశపాతేగాక కలకాలం అవి కడదేరేనా ఏడవలపు ఏడ సుద్దులు" అంటారు అన్నమాచార్య. ఇవన్నీ కూడా కలలోని సంపదలట. అవి నిలిచేవా, పెట్టేవా?

ఆయన తెలివిగా ఈ మోహం నుంచి ఎలా బయటపడతానని అడిగాడు. "ఈ మోహం అనేది విశ్వమంతా పరుచుకుంది. జ్ఞానమంటే ఏమిటో ఎప్పుడైనా ఆలోచించావా? జ్ఞానం అంటే ఏమిటనుకుంటున్నావు? ఇంద్రియ జ్ఞానమా? ఇంద్రియజ్ఞానమే గొప్పది అనుకుంటే పశువుల కన్నా నువ్వు గొప్పవాడివని గర్వించడానికి లేదు. సృష్టిలోని ప్రతి జీవికీ కూడా తదింద్రియ గతమైన జ్ఞానం ఉంది. ఒకరిలో ఎక్కువ ఉంటే ఒకరిలో తక్కువ.

"మనుష్యులకు ఒక కుటుంబ వ్యవస్థ పిల్లలు ప్రేమ... ఇవన్నీ ఉంటాయి" అన్నాడట సమాధి. "అలాగా! అయితే అటు చూడు" అన్నాడు సుమేధ. ఏమిటీ అంటే అక్కడ ఒక

గూడు కనిపించిందట. ఆ గూటిలోకి ఒక పక్షి వచ్చి తన నోట్లోంచి ఆహారం పిల్లలకు ఇస్తోందట. "అది చేస్తున్నది, నువ్వు చేసింది ఒకటే కదా – కుటుంబాన్ని పోషించడం. వీళ్ళు నా పిల్లలు, బాగుండాలి అనే మోహం పక్షిలోనూ ఉంది, నీలోనూ ఉంది; అందరిలోనూ ఉంది. నీలో, పక్షిలో ఆ మోహశక్తి ఎవరిచ్చారో ఆలోచించు... ఏ మహామాయ ఈ జగత్తంతా వ్యాపించి నడుపుతున్నదో ఆ తల్లి "తయా విసృజ్యతే విశ్వం జగదేతత్ చరాచరమ్" – ఈ మోహం సర్వ జీవుల్లో ఆ తల్లే పెట్టింది. మోహమే లేకపోతే ప్రపంచం అనాథ అయిపోదా? పుట్టిన పిల్లాణ్ణి చూడగానే గత జన్మలో నేనెవరో, ఇతడెవరో అనుకొని తల్లి పట్టించుకోకపోతే అతడి గతి ఏమిటి? అందుకే మరుపు అనే తెర కప్పి ఉంచి "వీడు నా పిల్లాడు, వీడిని పోషించాలి... వీడు పెరిగి పెద్దవాడయ్యే దాకా చూసుకోవాలి'' అనే మోహం పుట్టిస్తుంది. ఆ మోహమే లేకపోతే జగత్తు అనాథ కాదా? అదే మోహం యొక్క సానుకూల దృక్కోణం. అదే ప్రతికూలత అయితే అమ్మ సృష్టిలో మోహాన్ని ఉంచదు.

శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్‌శరీర విమోక్షణాత్। కామ క్రోధోద్భవం వేగం సయుక్తః ససుఖీనరః॥ అన్నాడు కృష్ణ పరమాత్మ. ఎవరు యోగి, ఎవరు సుఖి అంటే– ఎవరు తన శరీర విమోక్షణం లోపలే కామ క్రోధాల వేగాన్ని నియంత్రిస్తాడో వాడే యోగి, వాడే సుఖి. శరీరం పోయే లోపల అంటే ఈ శరీరం అనే సాధన పోతే ఈ కామ క్రోధాలనే అవిద్యను పోగొట్టుకునే మార్గం మరొకటి దొరకదు. అందుకే భగవానుడిచ్చిన ఈ ఉపాధిని సద్వినియోగం చేసుకుని రజోగుణ, తమోగుణాల్ని నియంత్రించుకోవాలి. రజోగుణం నుంచి ఉద్భవించిన కామక్రోధాల వేగాన్ని నియంత్రించుకునే సాధన ప్రతీ క్షణం చెయ్యాలి. దానికి నిగ్రహం చాలా అవసరం. ఆ కారణం చేతనే ఇక్కడ మోహానికి కూడా కొన్ని పరిమితులున్నాయి. సృష్టిలో ప్రతీ శక్తీ గొప్పదే. సృష్టిలో మోహాన్ని పెట్టింది అమ్మ. మోహం చాలా అవసరమే. మనం "మాతృదేవోభవ" అంటాం. అంటే – జగన్మాత మనల్ని కనికరించి అనుగ్రహించడానికి ముందు మన అమ్మలో "అమ్మ" అనే భావాన్ని పెట్టి, అక్కడ మోహాన్ని పెట్టింది. ఆ మోహం కూడా అమ్మవారి రూపమే. అది లేకపోతే మనం తరించలేం కనుక పెట్టింది. అయితే అది ఎంత వరకూ ఉండాలి – ఒక గృహస్థుగా ఎంత వరకూ అవసరమో అంతవరకే! ఆ తరువాత దానిలో నుంచి బయట పడాలి. మన వల్ల బయటపడడం అవదు అనుకుంటే ఈ మోహాన్ని నింపి ఉంచిన ఆ తల్లి పాదాలు పట్టుకుంటే, ఆవిడే ఆ మోహం నుంచి బయటపడేస్తుంది. పాశం వేసిన వాడే పాశం తీయగలడు. పాశం ఎందుకు వేశాడు, సంసారం లేకపోతే హాయిగా ఉండొచ్చు అనుకునేవాడు బద్ధకస్తుడు. గృహస్థ ధర్మం చెయ్యాల్సిందే! కానీ అందులో ఉంటూనే అది నేను కాదు అని ఉండగలగాలి. జీవుడు దాని నుండి బయట పడడానికి కావలసిన అసంగత్వంలో ఉన్నాడు అని తెలుసుకుంటే అమ్మే ఆ పాశం తీస్తుంది. కనుక "జగజ్జననిని ఆశ్రయించు" అని అప్పుడు అమ్మవారి చరిత్ర చెబుతున్నారు. అదే మహాకాళీ, మహాలక్ష్మీ, మహా సరస్వతీ చరిత్ర. మొదటిది మధుకైటభ సంహారం చేసిన మహాకాళీ చరిత్ర; రెండవది మహిషాసుర మర్దనం చేసిన మహాలక్ష్మి చరిత్ర; మూడవది శుంభ నిశుంభుల సంహారం చేసిన మహా సరస్వతి చరిత్ర. ఈ మూడూ కలిపి ఒకే శక్తి. రాక్షసులు ఉద్భవించి ప్రపంచానికి హాని చేసినప్పుడల్లా వారిని సంహరించి దేవతలనురక్షించడానికి నేను వస్తాను అన్నది అమ్మ. కానీ నిజానికి అమ్మ ఎప్పుడూ ఉన్నదే. జగద్రక్షణ కోసం ఆమె ఎప్పుడెప్పుడు ఆవిర్భవించిందో అన్ని చరిత్రలయ్యాయి, అన్ని రూపాలయ్యాయి, అన్ని నామాలయ్యాయి" అని మూడు చరిత్రలనూ చెప్పి ఇలాంటి జగదంబికను ఆశ్రయించండి అని వారే దగ్గరుండి ఉపాసన, దీక్ష అన్నీ ఇచ్చారు. అప్పుడు సురథుడు, సుమేధ భక్తితో అమ్మ వారిని ఉపాసన చేయగా అమ్మ వారు ప్రత్యక్షమయ్యారు. ❖

సశేషం



సంకల్పంలోనే సమస్తం

ఓ రామచంద్రా! భ్రమకు లోనై పశ్చిమదిక్కును చూసి "ఇది తూర్పుదిక్కు" అనుకుంటే విజ్ఞులు ఏది పశ్చిమమో, ఏది తూర్పో చెప్పాక, అది అతడు గ్రహించడం వల్ల అంతవరకూ ఉన్న దోషజ్ఞానం తొలగిపోతుంది కదా! పురుషప్రయత్నం చేసేవారికి కొంత కాలానికి దోషజ్ఞానం తొలగుతుంది. అప్పుడు మనస్సును జయించడం సులభమే అవుతుంది.

ఒకడు అనుద్వేగంగా, ఓర్పుతో, నేర్పుతో ప్రయత్నిస్తేనే ధనం, పదవి, రాజ్యం లభిస్తాయి. మనోజయం కూడా అలా ప్రయత్నించిన వాడికే సిద్ధిస్తుంది. అయితే రాజ్యం, ధనం, పదవి మొదలైనవాటిలో రాజభయం, చోరభయం, శత్రు భయం లాంటివి ఉంటాయి. స్వర్గలోకంలో కూడా, "నా పుణ్యమంతా ఖర్చయితే, అధోలోకాలకి వెళ్ళాలేమో..." అనే మనోవ్యాధి ఉండవచ్చు. కానీ, "ఈ మనస్సును జయించి, ఆత్మలోనే నిలిపి ఉంచడం" అనే దానిలో అలాంటి క్లేశాలు ఉండవు. అలాంటి "స్వభావమాత్ర వ్యావృత్తి" అయిన 'ఆత్మస్థితి' కోసం ఈ జీవుడు ఎందుకు ప్రయత్నిస్తూ ఉండకూడదు? ఓ జనులారా! అలాంటి చిత్త లయ రూపమైన ఆత్మస్థితి పొందక పోవడానికి కారణం అజ్ఞానమే. "మేము ఈ పనులలో ఉన్నాం. అందుకే ఆత్మస్థితిని పొందలేకపోతున్నాం" అనడం ఏ మాత్రం భావ్యం కాదు. "సర్వం ఆత్మతత్త్వమే" అనుకొని, యథాతథం గానే మీ మీ ధర్మాలను నిర్వర్తిస్తూ ఉండండి. ఆత్మ యొక్క చమత్కారమంతా గ్రహించిన తరువాత, మీకు ఏది ఉచితమని అనిపిస్తే అలా చేయండి. (కర్మలు నిర్వర్తించండి – లేదా త్యజించండి).

కాబట్టి "ఆత్మతత్త్వమైన ఆ భగవంతుడే ఇదంతా" అని గ్రహించి, ఆ సంగ్రహణ శక్తి ద్వారా మనస్సును జయించండి. ఈ మాత్రపు భావన కలిగి ఉండడానికి కష్టమేమిటి?

మన పిల్లలను మనం మంచి పనులలోనే నియమిస్తూ ఉంటాం. అదే విధంగా ఈ మనస్సును కూడా ఉత్తమ మార్గంలోనే నియోగించాలి. లేకుంటే దీనిని జయించడం కష్టమే అవుతుంది. ఏ మహాత్ములైతే ఈ మనస్సును ఒక పద్ధతిగా నియంత్రిస్తూ, క్రమంగా దీనిని నశింపజేస్తారో, వారు ఎక్కడ ఉంటే అక్కడ ఇతరులను కూడా 'ముక్తుల్ని' చేయగలరు.

ఎడారిలోనే ఎండమావులు ఎదురవుతాయి. ఈ "సంకల్పాలు" అనే వ్యవహారం నుండే భయంకరం, భ్రమదాయకం అయిన అనేక విపత్తులు ఉత్పన్నమవుతున్నాయి. అయితే కొందరు మహనీయులు సంకల్పాలకు ఆవల ఉన్న ఆత్మతత్త్వాన్ని సర్వదా పొందుతూనే ఉన్నారు. ఓ రామా! ప్రళయం వచ్చినా, సప్తసముద్రాలూ ఉప్పొంగి లోకాలన్నీ మునిగిపోయినా, ద్వాదశాదిత్యులు ఒక్కసారిగా ప్రజ్జ్వలించినా సరే తమ మనస్సును జయించివేసి సుస్థిరం చేసిన మహాత్ములు దుఃఖించరు. ఆనందాన్నీ పొందరు. తమ నిజస్థితిని వీడరు.

ఈ జగత్తులో, ఈ సృష్టిలో ఉత్తమోత్తమమైనది ఏదైనా ఉందీ అనుకుంటే, అది... అకృత్రిమం, జడరహితం అయిన అమనస్కమే.

ఈ జనులలో చాలామంది, "అయ్యో! ఏదో మహత్తరశక్తి, లేక 'విధి' అనేది మమ్మల్ని ఈ సంసారకూపంలో పడేసి బాధపెడుతోంది" అని అనుకొంటూ ఉంటారు. అది సరి కాదు. ఈ 'మనస్సు' అనే బీజంలో నుంచే సుఖ, దుఃఖాలు సంప్రాప్తిస్తున్నాయి. తన తలను తానే గోడకు బాదుకుంటూ "ఈ గోడ నన్ను హింసిస్తోంది" అనుకోవడం మూర్ఖత్వమే కదా! అలాగే, స్వసంకల్పరచన అయిన ఈ సంసార దోషాలకు ఎవరినో దూషించడం 'మూర్ఖత్వం' అని అనిపించుకుంటుంది. మనస్సు స్వసంకల్పాల నుండే ప్రభవిస్తోంది అని గ్రహించాలి. ❖

('శ్రీవసిష్ఠ రామ సంవాదం'
ఉత్పత్తి ప్రకరణం ఉత్తరార్థం నుంచి)
అనువాదం: వై. హెచ్. రామకృష్ణ

ధీరవాణి

– స్వామి వివేకానంద

సర్వత్రా ఆ సర్వేశ్వరుడే!

ఎవరెవరు ఏ యే రూపాల్లో ఉపాసిస్తారో, వారందరికీ ఆ యా రూపాల్లోనే విశ్వాసం కలిగిస్తాను. వారి దృక్పథాన్ని అనుసరించి, నేను వారికి దర్శనం ఇస్తాను" అన్నాడు శ్రీకృష్ణుడు.

లోకంలో అనేక రకాలైన ఆరాధనల్ని మనం చూస్తున్నాం. దేవుడి కోసమే దేవుణ్ణి ప్రేమించడం అత్యున్నతమైన ఆరాధన. దేవుడనేవాడు ఒకడుంటే లోకంలో ఇంత దుఃఖం ఎందుకుండాలి అనే ప్రశ్న తలెత్తుతుంది. భక్తుడు ఇలా జవాబిస్తాడు: "లోకంలో దుఃఖం ఉంది. అంతమాత్రం చేత దేవుణ్ణి ప్రేమించడం నేను మానుకోను. నా కష్టాన్ని తొలగించాల్సిందిగా నేను దేవుణ్ణి ప్రార్థించను. అతడు – ప్రేమస్వరూపుడు కాబట్టి నేనతణ్ణి ప్రేమిస్తాను."

ఈ జీవితాన్ని గడుపుతూ పవిత్రులం కావడం ఎలా? మనమంతా అడవులకో, కొండ గుహలకో పోదామా? దాని వల్ల మనకేం ప్రయోజనం? మనస్సు మన అధీనంలో లేనప్పుడు కొండగుహల్లో నివసించినంత మాత్రాన ఉపయోగం ఏమిటి? ఈ మనస్సే అక్కడ కూడా మనకు అవరోధం కల్పిస్తుంది. గుహలో మనకు ఇరవై భూతాలు ప్రత్యక్షమవుతాయి. ఎందుకంటే అవన్నీ మన మనస్సులో ఉన్నవే కాబట్టి, మనస్సు మన అధీనంలో ఉంటే మనం ఉన్న చోటనే గుహను సృష్టించుకోవచ్చు.

మనకు ప్రపంచం కనబడే తీరు మన మానసిక స్థితి మీద ఆధారపడి ఉంటుంది. మన మనోభావాలను అనుసరించి వస్తువులు సుందరంగానో, వికృతంగానో కనబడతాయి. లోకమంతా మన మనస్సులోనే ఉంది. సమ్యక్ దృక్పథంతో వస్తువులను చూడడం అలవరచుకోండి. ముందుగా ప్రపంచం మీద విశ్వాసం ఉంచండి. ప్రతి దానికీ అర్థం ఉందని నమ్మండి. లోకంలోని ప్రతి వస్తువూ మంగళకరమైంది, పవిత్రమైంది, సుందరమైంది. మీకేదైనా చెడు కనబడితే దాన్ని మీరు సరైన దృష్టితో దర్శించలేదని గ్రహించండి. భారం మీ మీదే వేసుకోండి! లోకం భ్రష్టమైపోతున్నట్లు మనకు తోచినప్పుడల్లా మనల్ని మనం విశ్లేషించుకోవాలి. ఆ తరువాత వస్తువుల యథార్థ స్వరూపాన్ని చూసే శక్తి మనలో లోపించిందని తెలియవస్తుంది. రేయింబవళ్ళూ కృషి చెయ్యండి. "చూడండి! ప్రతి కర్మా బంధమే. నేను నిష్కామంగా కృషి చేస్తాను. నిమిషమైనా పని మానుకుంటే అరాచకం, సంక్షోభం ఏర్పడతాయి. కాబట్టి మీరూ నిష్కామంగా పనిచెయ్యండి."

ఈ ప్రపంచం ఒక ఆట. ఆటలో మీరు భగవంతుడి సహచరులు. ఏ విధమైన దుఃఖానికీ, దైన్యానికీ తావివ్వక, మీ కర్తవ్యాన్ని నిర్వర్తించండి. మురికి వాడల్లో, విశాలమైన చావడుల్లో అతడి ఆటను గమనించండి. ప్రజోద్ధరణకు కృషి చేయండి. వారు నికృష్టులు, పతితులు అనే భావంతో మాత్రం కాదు. ❖

పరిప్రశ్న

- స్వామి మేధానంద పురి

- ఎస్.ఆర్.ఎన్. స్వామి, గిద్దలూరు

? : ధర్మం, అర్థం, కామం, మోక్షం - ఇవి నాలుగు పురుషార్థాలు. కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం - ఇవి ఆరు శత్రువులు. పురుషార్థంలోని కామం, అరిషడ్వర్గాలలోని కామం - ఈ రెండిటి గురించి వివరించగలరు.

✍ : ధర్మార్థాలలోని కామం అంటే నిషిద్ధకర్మలు వదిలి వేదవిహితకర్మలు ఆచరించి స్వర్గాదులు పొందడం. కర్మఫలం నశించిన తరువాత మిగిలిన కర్మల ఫలం అనుభవించడానికి వీరు తిరిగి భూలోకంలో జన్మిస్తారు. మాటిమాటికీ స్వర్గం నుంచి పతితులు కావడం వల్ల కామ్య కర్మలను నిష్కామభావంతో చేసి, మనస్సు శుద్ధి చెందిన తరువాత మోక్షార్థులు అవుతారు.

'పుత్రకామేష్టి', 'అశ్వమేధం'- కామ్యకర్మలే. "దశపూర్ణ మాసాభ్యం స్వర్గకామోయజేత" - అంటే స్వర్గాన్ని అభిలషించేవాడు దశపూర్ణయాగం చెయ్యాలి. "దధ్నా జుహోతి ఇంద్రియకామః" - ఇంద్రియ పుష్టి కోరేవారు పెరుగుతో హోమం చేయాలి. ఇవి విహిత కర్మలు.

పురుషార్థంలోని అర్థ కామాల్ని ధర్మబద్ధంగా అనుభవిస్తూ, మానవజన్మ పరమార్థమైన మోక్షాన్ని పొందాలి.

ఇక, అరిషడ్వర్గాలలోని కామం 'విషయేంద్రియజన్య సుఖం'. *'ప్రజాహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్...'* - కామవాసనలు గల పురుషుడు శాంతిని పొందలేడు అని గీతోపదేశ భావార్థం. కామం ద్వారా విషయాభిలాషి అయినవాడు మోక్షాన్ని పొందలేడు. మోక్ష ప్రాప్తికి ఈ కామం బంధ హేతువు. కాబట్టి పరమ పథం చేరడానికి అరిషడ్వర్గాలలోని కామాన్ని త్యజించాలి.

- బలివాడ వెంకట సుధాకరరావు, చీపురుపల్లి

? : చతుష్షష్టి కళలు, షోడశ కళలు వివరించగలరు?

✍: కళలు అరవై నాలుగు. అవి -

1. ఇతిహాసం 2. ఆగమం 3. కావ్యం 4. అలంకారం. 5. నాటకం 6. గాయకత్వం 7. కవిత్వం 8. కామశాస్త్రం 9. దురోదరం (పాచికలాడుట) 10. దేశభాషా లిపి జ్ఞానం 11. లిపి కర్మం 12. వాచకం 13. అవధానం 14. సర్వశాస్త్రం 15. శాకునం 16. సాముద్రికం 17. రత్నశాస్త్రం 18. రథాశ్వగజకౌశలం 19. మల్లశాస్త్రం 20. సూదకర్మం (పాకశాస్త్రం) 21. దోహదం 22. గంధవాదం 23. ధాతువాదం 24. ఖనివాదం 25. రసవాదం 26. జలవాదం 27. అగ్నిస్తంభం 28. ఖడ్గస్తంభం 29. జలస్తంభం 30. వాక్‌స్తంభం 31. వయుస్తంభం 32. వశ్యం 33. ఆకర్షణం 34. మోహనం 35. పరకాయ ప్రవేశం 36. ఉచ్చాటనం 37. మారణం 38. కాలవంచనం 39. విద్వేషణం 40. పాదుకాసిద్ధి 41. వాక్‌సిద్ధి 42. ఘుటికాసిద్ధి 43. ఐంద్రజాలికం 44. అంజనం 45. దృష్టివంచనం 46. స్వరవంచనం 47. మణిమంత్ర ఔషధాదిసిద్ధి 48. చోరకర్మం 49. చిత్రక్రియ 50. లోహక్రియ 51. అశ్మక్రియ 52. మృత్క్రియ 53. దారుక్రియ 54. వేణుక్రియ 55. చర్మక్రియ 56. అంబరక్రియ 57. అదృశ్యకరణం 58. దూతీకరణం 59. మృగయ 60. వాణిజ్యం 61. పాశుపాల్యం 62 కృషి 63. ఆసవకర్మం 64. ప్రాణిద్యూత కౌశలం

(ఆధారం: శబ్దరత్నాకరము, రచయిత: బహుజనపల్లి సీతారామాచార్యులు, 17వ ముద్రణ, 2004)

షోడశ కళలు: ఆ పరబ్రహ్మం ప్రాణాన్ని సృష్టించాడు. ఇక్కడ ప్రాణమంటే హిరణ్యగర్భుడు. 1. ప్రాణం 2. శ్రద్ధా 3. ఆకాశం 4. వాయువు 5. అగ్ని 6. జలం 7. భూమి 8. జ్ఞానేంద్రియ కర్మేంద్రియ దశకం 9. మనస్సు 10. అన్నం 11. బలం 12. తపస్సు (అంతః కరణ శుద్ధి సాధనం) 13. మంత్రాలు 14. కర్మం 15. లోకాలు 16. ప్రాణుల పేర్లు. ❖ *(ఆధారం: 'ప్రశ్నోపనిషత్తు', 6.4)*

- రెంటాల జయదేవ

శుభాలనిచ్చే శంఖం

ఎవరి ఇంట్లో అయితే, దక్షిణావర్తమైన శ్వేత శంఖాలు రెండు నిత్యపూజలు అందుకుంటూ ఉంటాయో, ఆ ఇంటి యజమాని సదా ఉచ్ఛస్థితిలో ఉంటాడు. ఏ కార్యం చేపట్టినా అందులో విజయం సాధిస్తాడు. అపజయాలు, దుర్దశలు ఆ వ్యక్తి దరిదాపుల్లోకి కూడా రావని ప్రజల నమ్మిక.

వర్తకులు చాలా మంది తమ దుకాణాల్లో తెల్లటి శంఖం ఉంచి, నిత్యపూజలు చేస్తుంటారు. అందువల్ల వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతుందనేది చాలా మందికి స్వానుభవం. దక్షిణావర్తమైన తెల్లటి శంఖంలో నీళ్ళు పోసి, ఆ నీటిని ఇంట్లో నలుదిశలా, కుటుంబ సభ్యులందరి మీదా పర్వదినాల్లో చల్లుతుంటారు. ఇలా చేయడం వల్ల ఆ ఇంటిని కానీ, ఇంట్లోని వారిని కానీ ఎలాంటి కష్టాలూ పీడించవని నమ్మకం. దుష్టగ్రహ ప్రభావం సైతం నిర్వీర్యమై పోతుంది. ఇక, ఈ శంఖంలో పాలు పోసి, లక్ష్మీ యంత్రానికీ, లక్ష్మీదేవికీ నైవేద్యం పెట్టడం వల్ల సిరిసంపదలు లభిస్తాయి.

శంఖంతో అభిషేకం: శాస్త్ర ప్రకారం శంఖం లక్ష్మీ స్వరూపం. దేవుడికి అభిషేకం చేసే అధికారం లక్ష్మీదేవికే ఉంది. కాబట్టి, లక్ష్మీదేవి ముఖాంతరంగా మనం పూజ చేయాలనేది నియమం. ఆ రకంగా అభిషేకంలో శంఖానికి ప్రత్యేక స్థానం ఉంది. ఏ యే పూజల్లో శంఖాన్ని వినియోగించాలో మన పెద్దలు చెప్పారు:

మహాభిషేకం సర్వత్ర శంఖేనైవ ప్రకల్పయేత్।
సర్వత్రైవ ప్రశస్తోబ్జః శివ సూర్యార్చనం వినా।
(తిథి తత్త్వే బ్రాహ్మే)

'సర్వదేవతా పూజల్లోనూ శంఖంతో మహాభిషేకం చేయాలి. శంఖంతో శివ సూర్యులను మాత్రం అభిషేకించ రాదు'.

శంఖంలో పోస్తేనే తీర్థం! : 'శంఖంలో పోస్తే కానీ, తీర్థం కాదు' అని మన వాళ్ళు అంటుంటారు. వైజ్ఞానికంగా చూస్తే మనిషి ఆరోగ్యానికి క్యాల్షియం ఎంతో కీలకం. క్యాల్షియం కార్బొనేట్, తదితర ఖనిజాలతోనే శంఖం తయారవుతుంది కాబట్టి, దానితో అభిషేకం చేసేటప్పుడు శంఖ స్పర్శతో ఆ అభిషేక జలానికి కొద్దిగా క్యాల్షియం వచ్చి చేరుతుంది. శంఖం ద్వారా తీర్థం స్వీకరించినప్పుడు అది మనిషిలోని వాత పిత్త దోషాల్ని హరిస్తుంది. బలాన్నీ, కాంతినీ ప్రసాదిస్తుంది. స్వామి తీర్థాన్ని పుచ్చుకొనేవాళ్ళు ఆరోగ్యంగా ఉంటారనీ, తులసితో కూడిన సాలగ్రామ తీర్థాన్ని శంఖం ద్వారా స్వీకరించినవారిలో అనేక రోగాలు నశిస్తాయనీ 'పరమ పురుష సంహిత' పేర్కొంటోంది. తీర్థాన్ని మూడు సార్లు పుచ్చుకొంటారు. ఒకటి శరీర శుద్ధికి! రెండోది ధర్మసాధనకు! మూడోది పరమ పదం కోసం!! తీర్థాన్ని స్వీకరించే సమయంలో సాధారణంగా -

అకాల మృత్యు హరణం సర్వవ్యాధి నివారణమ్।
సమస్త పాప శమనం విష్ణుపాదోదకం శుభమ్॥

అనే శ్లోకం పఠిస్తారు. విష్ణుపాదోదకమైన తీర్థం శుభకారిణి. ఆ తీర్థ సేవనం ద్వారా అకాల మృత్యువును పోగొట్టుకోవచ్చునీ, సర్వ వ్యాధులనూ నివారించుకోవచ్చునీ, సమస్త పాపాలనూ క్షయం చేయవచ్చునీ హిందువుల విశ్వాసం.



శంఖతీర్థం స్వీకరించడం వల్ల ఫలితం: శంఖం ద్వారా ఇచ్చే తీర్థాన్ని ఎలా స్వీకరించాలంటే:

చతుర్గుణీ కృత వస్త్రే పాణిం నిధాయ
తేనాదౌ శంఖతీర్థం శిరసి ధారయేత్।
శంఖ మధ్య స్థితం తోయం।
భ్రామితం కేశవోపరి।
అంగ లగ్నం మనుష్యాణాం।బ్రహ్మహత్యా
యుతం దహేత్॥ (నిత్య కర్మాష్టకే)

'నాలుగు మడతలు పెట్టిన వస్త్రం మీద కుడి చేతిని ఉంచాలి. ముందుగా అందులోకి శంఖ తీర్థాన్ని తీసుకొని, 'వక్ష్యమాణ' మంత్రం చెప్పి, శిరస్సున జల్లుకోవాలి'.

'శంఖ మధ్యమున ఉండేదీ, విష్ణు ప్రదక్షిణం చేసినదీ అయిన ఈ శంఖ తీర్థం మానవుల శరీరాన్ని స్పృశించి, బ్రహ్మ హత్యల వల్ల కలిగే పాపాన్ని సైతం పోగొడుతుంది'.

ఏది ఉత్తమ శంఖం?: సముద్రంలో పుట్టిన శంఖానికి చంద్రుడి ఆశీర్వాదాలు ఉన్నాయి. ప్రతీకాత్మకంగా చూస్తే గాలి, ప్రకృతి, మొత్తం నవగ్రహాలన్నీ శంఖంలో ఉంటాయని మన పూర్వీకులు చెబుతారు. అసాధారణమైన ఈ శంఖం శత్రువులను బలహీనపరిచి, యజమానికి ఆయుర్దాయ మిస్తుంది. వ్యాధులనూ, దారిద్ర్యాన్నీ, అజ్ఞానాన్నీ పారద్రోలుతుంది. ఇక, శంఖాన్ని చెవి దగ్గర ఉంచుకొన్నప్పుడు మంద్రమైన శబ్దాలు వినిపిస్తే, అది ఉత్తమమైన శంఖం. ❖

(వచ్చే సంచికలో... 'మహర్షుల మాట')

గణపతి చేసిన శివ కేశవ ప్రతిష్ఠ

కథ: టి.ఎం.ఎస్. చిత్రాలు: శంకర్ తెలుగుసేత: స్వామి జ్ఞానదానంద





రావణుడు సంధ్యావందనం పూర్తి చేసి వచ్చేసరికి కొంత ఆలస్యం అయింది. బాలుని రూపంలో వచ్చిన వినాయకుడు ఆ శివలింగాన్ని నేల మీద ఉంచేశాడు. రావణుడు దాన్ని కదిలించి, చేతితో పెళ్ళగించి తీసుకువెళ్ళాలని ఎంతగానో ప్రయత్నించాడు. కానీ దాన్ని అస్సలు కదల్చలేకపోయాడు.

రావణుడు శివలింగాన్ని పట్టుకుని లాగినప్పుడు అది ఆవు చెవి (గోకర్ణం)లాగ మారి పోయింది. శివలింగం ప్రతిష్ఠింపబడిన ఆ ప్రదేశం కర్ణాటక సరిహద్దులలో ఉన్న గోకర్ణ క్షేత్రం.

7 వినాయకుడి కృపాకటాక్షాన్ని తెలియజేసే మరొక కథ ఉంది. వనవాసం ముగించుకొని తిరిగి వచ్చిన శ్రీరాముని పట్టాభిషేకం వైభవంగా ముగిసింది. విచ్చేసిన అతిథులందరినీ ఆదరంతో సత్కరించి పంపాడు శ్రీరాముడు. విభీషణుని వంతు వచ్చినప్పుడు...

విభీషణుడు శ్రీరంగనాథుని విగ్రహంతో శ్రీరంగం చేరుకున్నారు. అప్పుడు వినాయకుని సంకల్పంతో ఆయనకు కావేరీ నదిలో స్నానం చేయాలని అనిపించింది. చేతిలోని విగ్రహాన్ని ఎక్కడ ఉంచాలి అనుకుంటూ ఉంటే ఒక బ్రహ్మచారి అటు వైపు వచ్చాడు.

మిగతా 36వ పేజీలో...

విద్యాప్రదాత వినాయకుడు

వినాయకుడి కన్నా అధికులు కానీ, వినాయకుణ్ణి ఆదేశించేవారు కానీ ఎవరూ లేరు. తన పైన మరొక నాయకుడు లేనివాడు వినాయకుడు. ప్రపంచంలో ప్రతీ ఒక్కరికీ వారి కన్నా అధికులు (వారిని శాసించేవారు) ఉంటూనే ఉంటారు. కానీ వినాయకుడు సర్వస్వతంత్రుడు. అందువల్ల భారతీయులు ముందు వినాయకుణ్ణి పూజిస్తారు.

భారతదేశంలో సనాతనకాలం నుండీ వినాయకుడి ఆరాధన ఉంది. ఋగ్వేదంలోనూ, నారాయణోపనిషత్తులోనూ, తైత్తిరీయ ఉపనిషత్తులోనూ వినాయకుణ్ణి స్తుతిస్తూ ఎన్నో స్తోత్రాలున్నాయి.

ఏకదంతాయ విద్మహే వక్రతుండాయ ధీమహి
తన్నో దంతిః ప్రచోదయాత్

వినాయకుడి మహిమను చెప్పే ఈ మంత్రం 'గణపతి అథర్వ శీర్షోపనిషత్తు' లోనిది.

వినాయకుడి ఏనుగు తల బుద్ధి సూక్ష్మత, వివేచన, జ్ఞానాలకు సంకేతం. ఏనుగు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండి, పరిసరాలను గురించి ఎరుక కలిగి ఉంటుంది. దానికి జ్ఞాపక శక్తి అత్యధికం. దట్టమైన అరణ్యంలో సంచరించేటప్పుడు నిర్దిష్టమైన మార్గంలో గంభీరంగా నడుస్తుంది. తనకు తెలియకుండానే ఇతర జంతువులకు మార్గనిర్దేశం చేయడం ఏనుగు స్వభావం. వినాయకుడు సర్వ ప్రపంచానికీ మార్గదర్శకుడు. ఆయన విఘ్నాలకు నాయకుడు; అవసరమైనప్పుడు విఘ్నాలను కలిగించేదీ ఆయనే. తనను భక్తితో తలచుకున్న వారి విఘ్నాలను అధిగమించడంలో తోడ్పడేదీ ఆయనే!

బుద్ధి, సిద్ధి మూర్తీభవించిన రూపం వినాయకుడిది. వేదవ్యాసుడు తాను మహాభారతాన్ని చెబుతుంటే వ్రాయాల్సిందిగా వినాయకుణ్ణి ప్రార్థించాడు. అందుకు సమ్మతించి వినాయకుడు వెంటనే తన దంతాన్ని విరిచి మహాభారతం వ్రాయడానికి కూర్చున్నాడు.

వినాయకుడి వాహనం ఎలుక (మూషికం). మూషికం చీకటికీ, అజ్ఞానానికీ గుర్తు. వినాయకుడు చీకటిని (అజ్ఞానాన్ని) నిరోధించగలడు కనుక ఆయనను మూషిక వాహనుడు అంటారు. అజ్ఞానపు చీకటిని పారద్రోలి, ప్రపంచాన్ని జ్ఞాన ప్రకాశంతో నింపుతాడు వినాయకుడు.

మూషికం ఘ్రాణేంద్రియానికి సంకేతం. వాసనను అనుసరించి ఎలుక సంచరిస్తుంటుంది. వాసన(కోరిక)లపై ఆధిపత్యం గలవాడు వినాయకుడు. వాసనల (కోరికల)కు, ప్రతీక అయిన ఎలుక మీద స్వారీ చేస్తాడని చెప్పడమే ఎలుక ఆయన వాహనం అనడంలోని అంతరార్థం.

పవిత్రమైన మనస్సు ఉంటే శాంతిని పొందుతాం – అదే సిద్ధి అంటే! వినాయకుడు బుద్ధి, సిద్ధి (వివేకం, ఆత్మసాక్షాత్కారం)లకు అధిపతి. అందుకే ప్రతి ఒక్కరూ మనస్సును తమ వశంలో ఉంచుకోవాలి.

వినాయకుడు సకల విద్యాధిదేవత. విద్య అంటే కేవలం పుస్తక పాండిత్యమొక్కటే కాదు. విశ్వవ్యవస్థకు సంబంధించిన ప్రతిదీ విద్యయే! అయితే నేటి కాలంలో సమాచార సేకరణను విద్య అంటున్నారు. ఒక వ్యక్తి జీవితం మొత్తం ఒక నిరంతర విద్యాభ్యాస ప్రక్రియ. ఏ విచారణా ప్రక్రియ అయినా విద్యకు సంబంధించినదే. అయితే ప్రధానంగా మన విచారణ ఏది అనిత్య (క్షణిక)మైనది, ఏది శాశ్వతమైనది అనే దానికి సంబంధించి ఉండాలి. అదే నిజమైన జ్ఞానం.

వినాయకుడి ఏనుగు తల, పెద్ద బొజ్జలను చూసి ఆయన రూపం వికారంగా ఉంది అనుకోకూడదు. విశ్వాన్నంతటినీ తనలోనే ఇముడ్చుకున్న దైవం ఆయన. వినాయక చవితి లాంటి పుణ్యదినాలలో భగవత్తత్త్వాన్ని తెలుసుకోవడం, మన మనస్సును పవిత్రంగా ఉంచుకోవడం చెయ్యాలే తప్ప కేవలం విందులూ, వినోదాలతో సెలవు దినాల లాగ గడపడం కాదు. ❖

సూర శ్యాముని లీలలు

– యం. పార్వతి

శ్రీకృష్ణుని రూపమే మోహనం. ఆ మోహనుని రూపాల్లో బాలకృష్ణుడి రూపం మనోమోహనం. సూర్‌దాస్ దృష్టిలో ఆ మోహన రూపం ఎంత మనోహరంగా ఉందో చూద్దాం:

శోభిత్ కర్ నవనీత్ లియో, ఘుటురున్ చలత్
రేణుతన్ మండిత్ ముఖ్ దధి లేప్ కియె
కరులా కంఠ్ బజ్ర్ కే హరి నఖ్ రచత్ రుచిర్ హియె
ధన్య సూర్ ఏకో పల్ యా సుఖ్, కా సత్ కల్ప్ జియె

కృష్ణుడు చేతిలో వెన్నతో శోభాయమానంగా ఉన్నాడట. మోకాళ్ళ మీద దోగాడుతూ ఉన్నందు వల్ల శరీరం ధూళి ధూసరితమైందట. ముఖానికి పెరుగు అంటిందట. అందమైన చెక్కిళ్ళు, అంతలేసి కళ్ళు, నుదుట కస్తూరీ తిలకం, వీటికి తోడు నల్లని ముంగురులు! మొత్తం మీద అందమంతా ఆ చిన్ని కృష్ణుని ముఖార విందంలోనే ఉన్నట్లు ఉందట. నుదిటి మీద కదిలీ కదలక కదలాడుతున్న ముంగురులు, మకరందం త్రాగి మత్తెక్కిన తుమ్మెదల్లా ఉన్నాయట. అంతే కాక వజ్రంతో చేయబడిన పులిగోరు పతకం హృదయం మీద కదులుతూ మరింత శోభాయమానంగా ఉందట. ఇన్ని అందాలతో కూడుకున్న చిన్ని కృష్ణుణ్ణి ఒక్క క్షణం చూసినా చాలు అంటారు సూర్‌దాస్. ఆ దర్శనం వల్ల కలిగే అనుభూతి చాలు, జీవితం ధన్యం కావడానికి అంటారు. ఆ భాగ్యం కలగనప్పుడు ఎన్ని కల్పాలు జీవించి ఏం ప్రయోజనం! మన పోతన "నిన్ను పొడగానగాలేని చక్షురింద్రియముల సత్వమేల? నీకు దాస్యమ్ము సేయని జన్మమేల ఎన్ని జన్మములకు?" అన్నట్లుగానే ఈ కవి కూడా ఆ బ్రతుకు వ్యర్థమే కానీ సార్థకం కాదు కదా అంటారు.

ఇక వెన్న దొంగ కన్నయ్య! తల్లి యశోదమ్మకు పట్టుబడినా తప్పించుకోడానికి ఎన్నెన్ని మాటలు చెప్పాడో ఎన్నెన్ని అలుకలు పోయాడో చెప్పడం సూర్‌దాస్‌కే సాధ్యం.

మయ్యా, మై నహీం మాఖన్ ఖాయో, భోర్ భయో గయ్యన్ కే పీఛే
చార్ పహర్ బంసీవట్ భటక్యో సాంఝ్ పరే ఘర్ ఆయో
మై బాలక్ బహియన్‌కో చోటో ఛీకో కెహి విధి పాయో
యహ్ లే అపనీ లకుటి కమరియా బహుత హి నాచ్ నచాయో
సూర్‌దాస్ తబ్ బిహసి యశోదా లే ఉర్ కంఠ్ లగాయో

"అమ్మా! నేను వెన్న తినలేదు. ఉదయమనగా ఆవుల్ని మేపడానికి మధువనానికి వెళ్ళాను. సాయంకాలం తిరిగి వచ్చాను. ఇంతేకాక పగలంతా మురళి వాయిస్తూ, చెట్ల నీడల్లో తిరుగుతూ ఉన్నాను. అలాంటి నాకు వెన్న దొంగతనం చేసే సమయం ఎక్కడుంది? పోనీ ఏదో సమయం చూసుకొని చేశాననుకున్నా ఎలా చేస్తాను? నేనా చిన్నవాణ్ణి, నా చేతులూ చిన్నవే! ఇంకెలా అంత ఎత్తున ఉన్న ఉట్టిని అందుకుంటాను? ఉట్టిలోని వెన్న ఎలా దొంగిలిస్తాను? దొంగలించక పోయినా నా ముఖానికి వెన్న ఎలా అంటింది అనుకుంటున్నావేమో! అది నా ఘనకార్యం కాదు. గోప బాలురు ఎందుకో నా పైన వైరం పూనారు. వారు దొంగతనం చేసి, బలవంతంగా నా ముఖానికి వెన్న రాశారు. నా పైన ద్వేషంతో ఇలాంటి పనులు చేసే వీరి మాటలను నమ్మావు. అమ్మా! నువ్వు చాలా అమాయకురాలివి. లేకపోతే వీళ్ళ మాటలను నమ్మగలిగేదానివా? ఇన్ని మాటలెందుకులే! నీ మనసులో ఏదో భేద భావం కలిగింది. అయినవాళ్ళనే పరాయివాళ్ళనుకుంటున్నావు. సరే! ఇక నీ విచ్చిన కంబళి, కర్ర కూడా నాకు వద్దు. నీవే తీసుకో. ఏమైనా చేసుకో. (సాధారణంగా పిల్లలు తమ పంతం లేదా హఠం నెగ్గనప్పుడు తమ దగ్గరున్న వస్తువులను విసిరివేయడం, వద్దనడం చేస్తూ ఉంటారు. చిన్ని కృష్ణుడూ ఆ పసితత్వానికి అతీతుడు కాలేకపోయాడు. కాలేదు కూడా!)

ఈ విధంగా కృష్ణుడు తన తప్పిదాన్ని కప్పిపుచ్చడానికి చెబుతున్న అబద్ధాలకూ, ఆ అబద్ధాల మాటున దాగిన అమాయకత్వానికీ ముగ్ధురాలు అవుతూ యశోద, "నాకేమీ వద్దు" అంటున్న కన్నయ్య తిరస్కార భావాన్ని భరించలేక ఒక్కసారిగా వాత్సల్యంతో కొడుకును దగ్గరకు తీసుకొని నవ్వుకుందట. చిన్నవాడనుకున్న తన చిట్టి తండ్రి ఎన్నిమాటలు నేర్చాడో అని కావచ్చు! 'వెన్న కొరకు ఇన్ని అబద్ధాలెందుకురా కన్నా' అని కావచ్చు, నవ్వుకుంది. మన మనసుల్లోనూ వాత్సల్యభావాల చల్లదనపు జల్లును కురిపించింది యశోదమ్మ. ❖

(ఆగష్టు 13, గురువారం - శ్రీకృష్ణ జయంతి)

ఓ మహాత్యాగి ఆత్మకథ

(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

(...గత సంచిక తరువాయి)

(మహా భక్తుడు, అద్వైత వేదాంతి, కర్మయోగి, ప్రవక్త, శ్రేష్ఠసన్న్యాసి, గురువు, యుగాచార్యుడు, దేవదూత, పరమహంస శిష్యుడు, మానవ జాతి ప్రేమికుడు, మహా దేశభక్తుడు, ధ్యానసిద్ధుడు, మహాయోగి, గంధర్వ గాయకుడు ఇలా విభిన్న రూపాలలో స్వామి వివేకానంద మనకు దర్శనమిస్తారు. స్వామీజీ సంభాషణలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, లేఖల్లో స్వయంగా తెలిపిన తన జీవితానుభవాలను ధారావాహికంగా 2009 జూన్ సంచిక నుంచి అందిస్తున్నాం.)

నేను జన్మించినప్పుడు మా నాన్న నా జాతకం వ్రాయించారు. కానీ దాని గురించి నాకెప్పుడూ ఏమీ చెప్పలేదు! ఆయన మరణించిన కొన్ని సంవత్సరాల తరువాత మా ఇంటికి వెళ్ళినప్పుడు మా అమ్మ దగ్గరున్న కొన్ని కాగితాల మధ్యలో ఈ జాతకాన్ని చూశాను. అందులో నేను పరివ్రాజక సన్న్యాసినై భూమండలమంతా పర్యటిస్తానని ఉంది.

నాకు ఆధ్యాత్మికత, తత్త్వశాస్త్రాలంటే బాల్యం నుండే ప్రగాఢమైన ఆసక్తి ఉండేది. 'త్యాగమే' మనిషి అభిలషించ వలసిన మహోన్నత ఆదర్శమని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. నాలో ఈ త్యాగాగ్నిని రగిలించి, తను నడిచిన మార్గంలో నన్ను నడిపి, 'త్యాగాన్నే' దృఢ సంకల్పంగా మార్చడానికి ఒక మహాచార్యుని అవసరం ఏర్పడింది. ఆ త్యాగమూర్తే శ్రీరామకృష్ణ పరమహంస! ఆయనలోనే నా మహోన్నత ఆదర్శమైన 'త్యాగం' సాక్షాత్కారమవడం చూశాను.

సన్న్యాసులకు బంధాలుండవు. కానీ ఒకే ఒక్క అనుబంధం ఉంటుంది. అదే 'గురుశిష్య సంబంధం'. కన్నతండ్రి కన్నా గురువు గౌరవనీయుడు, నా తండ్రి కన్నా గురువుకే నా మొదటి పూజా గౌరవాలు! ఎందుకంటే తండ్రి కేవలం నాకీ శరీరాన్నిచ్చాడు, కానీ గురువు నాకు ఈ శరీర బంధాన్ని' తొలగించే మోక్షమార్గం చూపాడు. కనుక తండ్రి కన్నా గురువే గొప్పవాడు.

శ్రీరామకృష్ణ పరమహంస చాలా వింతైన మనిషి. ఆయన శాస్త్ర పాండిత్యానికై పాకులాడలేదు. కానీ బాలునిగా ఉన్నప్పుడే సత్యసాక్షాత్కారమనే తీవ్ర వ్యాకులతలో మునిగి పోయారు. మొదట హిందూ ధర్మసాధనలు చేశారు. ఆ తర్వాత ఇతర ధర్మాలలోని సత్యాన్ని కనుగొనాలనే తపనతో ఒకదాని తర్వాత మరొకటిగా అన్ని మత శాఖల సాధనా మార్గాలలోనూ ప్రవేశించారు. ఆ యా మత గురువులు చెప్పినట్లుగా కచ్చితంగా సాధన చేస్తూ, భక్తుల సాంగత్యంలో క్రమంగా ఆ సాధనా మార్గాల ఆదర్శాలతో తాదాత్మ్యం చెందేవారు. అన్ని సాధనల తర్వాత అన్ని మతాలూ సత్యమే అని నిరూపించారు.

సామాన్య గ్రామీణ భాషలో మాట్లాడే ఈ అద్భుత వ్యక్తిని (శ్రీరామకృష్ణులు) చూడడానికీ, అసమానమైన ఆయన బోధనల్ని వినడానికీ వేలమంది వచ్చేవారు! ఈయన కలకత్తా దగ్గర నివసించారు, (అది అప్పట్లో) భారత రాజధాని. వందలాది నాస్తికులు, భౌతిక వాదులు అక్కడి విశ్వవిద్యా లయాల నుండి ప్రతి ఏటా బయటకు వచ్చేవారు. ఈ నాస్తికులూ, భౌతికవాదులూ వచ్చి ఆయన మాటలు వినేవారు! నేనూ ఆయన గురించి విన్నాను. వారి మాటలు వినాలని వెళ్ళాను. ఆయన కేవలం ఏ ప్రత్యేకతా లేని ఒక సామాన్య వ్యక్తిగా కనిపించారు.

పరమహంసతో ప్రథమ సమావేశం: దక్షిణేశ్వర కాళికాలయ ఉద్యానంలోని వారి గదిలో మొదటిసారి కలిశాను. రెండు పాటలు పాడాను, ఆయన సమాధి మగ్నులయ్యారు; తరువాత రామచంద్ర దత్తాతో "ఎవరీ అబ్బాయి? ఎంత బాగా పాడుతున్నాడు!" అన్నారు. పాట ముగిసిన కాసేపటికి హఠాత్తుగా ఆయన లేచి నా చేయి పట్టుకొని, ఉత్తర దిక్కు వరండాకు తీసుకెళ్ళి తలుపు మూసేశారు. అక్కడ మేమిద్దరం తప్ప వేరెవరూ లేరు. నాకేదో వ్యక్తిగత ఉపదేశమిస్తారనుకున్నాను; కానీ ఆశ్చర్యకరంగా నా చేయి పట్టుకొని, ఆనంద భాష్పాలు ధారలు కట్టగా, చిరపరిచితునిలా చాలా ఆప్యాయంగా "ఆహా! ఇంత

ఆలస్యంగా వచ్చావు! నన్నిన్నాళ్ళుగా వేచి ఉంచడానికి ఎంత నిర్దయుడివి! లౌకికుల వ్యర్థపు మాటలు వినీ, వినీ నా చెవులు మండిపోతున్నాయి. ఓహ్! నా హృదయాంతరాళంలోని అనుభూతుల్ని అర్థం చేసుకోగల వ్యక్తి కోసం నేనెలా పరితపిస్తున్నానో తెలుసా?" అని ఏడుస్తూ నా ముందు చేతులు జోడించి నిలబడ్డారు. అంతేకాకుండా, "ప్రభూ! నీవు ఆ సనాతన ఋషి నారాయణుని అవతారమైన 'నరుడవనీ, జీవుల దుఃఖాలను బాపడానికై భువిపై అవతరించావనీ నాకు తెలుసు ప్రభూ!" – ఇలా ఇంకా ఏవేవో అంటున్నారు.

ఆయన ప్రవర్తన చూసి నేను నిర్ఘాంత పోయాను! 'నేనెవర్ని చూడడానికి వచ్చాను? కచ్చితంగా ఈయన పిచ్చివాడే! విశ్వనాథ దత్తా కొడుకునైన నన్ను పట్టుకుని ఈయన ఏదేదో అంటున్నారే! ఎంత విచిత్రం!' అని అనుకుంటూనే వింటున్నాను. ఇంతలో ఆయన తన గదికి వెళ్ళి, కొన్ని మిఠాయిలు, కలకండ, వెన్న తీసుకొచ్చి తన చేతులతోనే స్వయంగా నాకు తినిపించడం ప్రారంభించారు.

"అవి నా చేతికి ఇవ్వండి. వాటిని నా మిత్రులతో పంచుకుంటాను" అని నేనెంత వారించినా వినలేదు. "వారు మళ్ళీ తింటారులే!" అంటూ నేనవి తిన్నాకనే వదిలారు. నా చెయ్యి లాగి పట్టుకొని, "త్వరలోనే మళ్ళీ ఏకాంతంగా కలుస్తానని మాటివ్వు" అన్నారు. వారు బ్రతిమాలడం చూసి ముక్తసరిగా "సరే" నని ఆయనతో పాటు వారి గదిలోనున్న మిత్రుల దగ్గరకొచ్చాను.

పవిత్రతా నిలయం పరమహంస జీవితం: ఆయన మాటలు, కదలికలు, వ్యవహారం – ఏమీ తప్పనిపించలేదు. పైగా ఆయన ఉపదేశాలు, దివ్యభావ పారవశ్యమూ చూస్తే ఓ నిజమైన త్యాగమూర్తిలా అనిపిస్తారు. ఆయన మాటలు, చేతల మధ్య ఎంతో సామరస్యం ఉంది. భాష కూడా చాలా సరళం! 'ఈ వ్యక్తి ఒక గొప్ప గురువా?' అనుకుంటూ మెల్లగా ఆయన దగ్గరకు చేరి, "స్వామీ! మీరు భగవంతుణ్ణి చూశారా?" అని ఎంతోమందిని అడిగిన ప్రశ్ననే అడిగాను. "ఔను! నిన్ను చూసినట్లు ప్రత్యక్షంగా, అంతకన్నా స్పష్టంగా భగవంతుణ్ణి చూశాను, చూస్తున్నాను. భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవచ్చు. నేను నిన్ను చూసి మాట్లాడుతున్నట్లుగానే భగవంతుణ్ణి చూడవచ్చు. ఆయనతో మాట్లాడవచ్చు. కానీ భగవంతుడెవరికి కావాలి? లోకులు భార్యాబిడ్డల కోసం, ధనసంపదల కోసం కడవల కొద్దీ కన్నీరు కారుస్తారు! కానీ భగవంతుని కోసం ఎవరు విలపిస్తారు! ఆయన కోసం ఆర్తితో విలపిస్తే, ఆయన తప్పక ప్రత్యక్షమవుతాడు" అన్నారు.

ఈ మాటలు నన్ను కట్టిపడేశాయి! భగవంతుణ్ణి ప్రత్యక్షంగా చూశాననీ, ఆధ్యాత్మికత అనేది అనుభవైక సత్యమనీ, మనం దృశ్య ప్రపంచాన్ని అనుభవించిన దాని కంటే కోటి రెట్లు ఎక్కువగా అనుభూతి చెందగలమనీ నిర్భయంగా చెప్పగలిగిన వ్యక్తిని నా జీవితంలో మొట్టమొదటి సారిగా చూశాను. ఈ అమృత వాక్కుల్ని విని, వాటిని

ఆయన ఓ సామాన్య పండితునిలా కాక తన స్వీయ అనుభవపు లోతుల్లో నుంచి చెబుతున్నారని గ్రహించాను. కానీ వారి ఈ మాటలకూ, నాతో ఒంటరిగా ప్రవర్తించిన తీరుకూ పొంతన కుదరలేదు. ఆయనో రకమైన పిచ్చివారై ఉండాలని నిర్ణయించుకొన్నాను. అయినా ఆయన మహోన్నతమైన త్యాగానికి తలవంచకుండా ఉండలేకపోయాను.

ఆయనకి పిచ్చి ఉండవచ్చుగాక! కానీ చాలా కొద్దిమందికి మాత్రమే అలాంటి త్యాగం అబ్బుతుంది. పిచ్చివారైనా సరే, ఈయన పవిత్రులలోకెల్లా పవిత్రుడు. నిజమైన మహాత్ముడు. కేవలం ఈ త్యాగనిష్ఠ కొరకే మానవాళి అంతటికీ ఆయన పూజార్హుడు. ఇలాంటి పరస్పర విరుద్ధ భావాలతో ఆయన ముందు ప్రణమిల్లి, నేను కలకత్తా తిరిగి వచ్చాను. ❖ *(సశేషం)* అనుసృజన : **స్వామి అర్చనానంద**

మహా పుణ్యప్రదం మహాత్ముల సంస్మరణం

– స్వామి తథాగతానంద

భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి అఖండానందజీ మహరాజ్ ఆదేశం మేరకు నారాయణ మహరాజ్ (స్వామి సర్వగతానందజీ) కాలినడకన 1934 డిసెంబర్ 3వ తేదీన ముంబయి నుంచి బయలుదేరి 1935 ఫిబ్రవరి 7వ తేదీన హరిద్వార్ చేరుకున్నారు. అక్కడ కంఖల్ రామకృష్ణ మిషన్ కేంద్రంలో బ్రహ్మచారిగా చేరారు. 1936వ సంవత్సరంలో స్వామి అఖండానందజీ మహరాజ్ వారి వద్ద నుంచి మంత్రదీక్షనూ, 1944లో మాతృమూర్తి శ్రీశారదాదేవి శిష్యులైన స్వామి విరజానందజీ మహరాజ్ నుంచి సన్న్యాస దీక్షనూ స్వీకరించారు.

శ్రీమత్ స్వామి సర్వగతానందజీ మహరాజ్ బోస్టన్ (యు.ఎస్.ఏ.) రామకృష్ణ వేదాంత సొసైటీలో 2009 మే 3వ తేదీ ఉదయం 5.30 గంటలకు మహాసమాధి పొందారు. స్వామీజీ వయస్సు 96 ఏళ్ళు. పూజ్య స్వామీజీ తూర్పు గోదావరి జిల్లాలోని ముమ్మిడివరం గ్రామంలో 1912వ సంవత్సరంలో జన్మించారు.

పూజ్య స్వామి సర్వగతానందజీ గురించి న్యూయార్క్ వేదాంత సొసైటీ అధ్యక్షులు స్వామి తథాగతానందజీ చేసిన సంస్మరణ ప్రసంగంలోని ముఖ్యాంశాల అనువాదం ఇది :

గురువు స్వామి అఖండానందజీ ఆజ్ఞ మేరకు నారాయణ మహరాజ్ (స్వామి సర్వగతానంద) చేతిలో చిల్లిగవ్వ లేకుండా, ఒక్క పూటే భిక్ష స్వీకరిస్తూ, పాదరక్షలు లేకుండా, కాలినడకన ముంబయి నుండి హరిద్వార్ వెళ్ళారు. ఎన్నో కష్టాలతో కూడిన పాదయాత్రా విశేషాలను నారాయణ మహరాజ్ స్వయంగా ఇలా వివరించారు:

‘1934 నవంబర్ 12వ తేదీన ముంబయి రామకృష్ణ ఆశ్రమంలో స్వామి అఖండానందజీ మహరాజ్ వారి దర్శన భాగ్యం లభించింది. నా ప్రథమ సమావేశంలోనే స్వామీజీతో అన్యోన్య అనుబంధం ఏర్పడింది. ఆయన నాతో ఆప్యాయంగా మాట్లాడుతూ, ఎన్నో విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోజూ సాయంకాలం ఆశ్రమానికి వెళ్ళి, స్వామీజీని దర్శించడం వల్ల ఆయనకు మరింత సన్నిహితుణ్ణయ్యాను.

గుర్వాజ్ఞతో సాగిన పాదయాత్ర: ఒకరోజు స్వామీజీతో ఆధ్యాత్మిక జీవనం గడపాలన్న నా కోరికను తెలియజేశాను. అప్పుడు ఆయన నా మాటల్లో, ఆధ్యాత్మిక జీవనంలో భాగంగా యథోచితంగా కొంత సామాజిక సేవ చెయ్యాలన్న నా సంకల్పాన్ని పసిగట్టారు. తరువాత నాతో ‘నేను నిన్ను హరిద్వార్ పంపుతాను. అక్కడ నీకు రోగి నారాయణ సేవ చేసే అవకాశం ఉంటుంది. అక్కడ స్వామి వివేకానందుల వారి శిష్యుడైన ఓ ప్రముఖ స్వామీజీ పర్యవేక్షణలో నువ్వు సేవ చేయవచ్చు. కానీ ఒక్క షరతు, నువ్వు హరిద్వార్‌కు కాలినడకన పాదరక్షలు లేకుండా వెళ్ళాలి. నేను కూడా పాదరక్షలు లేకుండా శీతకాలంలో హిమాలయాలలో పర్యటించాను’ అని తమ స్వానుభవాన్ని వెల్లడించారు.

నేను సన్న్యాసం స్వీకరించాలంటే పాదరక్షలు లేకుండా కాలిబాటన హరిద్వార్ నడచివెళ్ళడం తప్పనిసరి అని చెప్పి మూడు షరతులు విధించారు. అవి ఏమిటంటే – వెంట ధనం తీసుకుపోకూడదు, విహార యాత్రలు చేయకూడదు, ఒక్క పూటే భుజించాలి. ఈ షరతులన్నింటినీ నేను పాటించి, నిర్విఘ్నంగా గమ్యం చేరగలనన్న నమ్మకం నాకు లేదు. కానీ ఆయన ఆశీర్వాద ప్రభావం వల్ల నాలో ఓ వినూత్న శక్తి ద్యోతకమైంది. 1934 డిసెంబరు 3వ తేదీన బొంబాయి నుండి హరిద్వార్ వెళ్ళడానికి నడక ప్రారంభించాను.

మార్గమధ్యంలో ఎన్నో ఇబ్బందులు, ఇరకాటాలు ఎదురయ్యాయి. పాదరక్షలు లేకుండా ఎగుడుదిగుడు బాటల్లో

పయనించడం వల్ల మడమలు పగిలి రక్తం కారడం మొదలైంది. ఆకలి బాధతో నీరసించిపోయాను. ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితిలో రోడ్డు ప్రక్కన ఓ చెట్టు క్రింద విశ్రమించాను. "ఇదే నా మరణ నికేతనమైతే, నన్ను కడతేర్చు ప్రభూ!" అని దీనంగా రామకృష్ణులను స్మరించాను. కొద్ది క్షణాలలో నిద్ర నన్ను ఆవహించింది.

ఎవరో వచ్చి, నిద్ర లేపి తమ బస్సు దగ్గరకు రావాల్సిందిగా పిలిచారు. నా దగ్గర పైకం లేదనీ, పైగా అడుగు తీసి అడుగు వేసే ఓపికా శక్తీ కూడా లేవనీ నేను అతనికి చెప్పాను. అతడు నన్నెత్తుకొని బస్సు దగ్గరకు మోసుకొనిపోయి ఓ స్థానంలో కూర్చోబెట్టాడు. ఆ సీటుపై నేను కొద్దిసేపు విశ్రాంతి తీసుకొన్నాను. బస్సులో డ్రైవరు, కండక్టరు తప్ప వేరే ప్రయాణికులెవరూ లేరు. నన్ను మహారాష్ట్రలోని ధులియాకు తీసుకువెళ్ళారు. బస్సు ఆగగానే త్రోవ మధ్యలో ఉన్న ఓ ఇల్లు చూపి నన్నక్కడికి వెళ్ళమన్నారు. నెమ్మదిగా అక్కడికి నడిచాను. అక్కడ ఇద్దరు మనుష్యులు ఏవో న్యాయపరమైన విషయాలపై తీవ్రంగా చర్చించుకొంటున్నారు. 'అంతరాయం కలిగిస్తున్నందుకు మన్నించండి. ఆ బస్సు ఆయన నన్నిక్కడికి వెళ్ళి విశ్రమించమన్నాడు' అని వారితో చెప్పాను. అందులో ఒకరు నన్ను లోపలికి పిలిచి, ఆ గదిలోనే తెర ప్రక్కనున్న మంచంపై విశ్రమించమన్నారు. తరువాత నిశ్శబ్దం. కొంతసేపటి తరువాత ఎవరో వచ్చి నా యోగక్షేమాలు విచారించారు. నేను హరిద్వార్‌లోని కంఖల్ రామకృష్ణ ఆశ్రమానికి వెళుతున్నానని చెప్పాను.

అతడు రక్తసిక్తమైన నా పాదాలను పరీక్షించాడు. రెండో అంతస్తులోకి తీసుకెళ్ళాడు. అక్కడ రెండు చిన్న గదులున్నాయి. ఒకటి ప్రార్థనా మందిరం. మరొకదానిలో ఓ మంచం ఉంది. ఆయన సదాశివరామకృష్ణ జోషీ. అంతకు ముందు నన్ను లోపలికి ఆహ్వానించినవారు ఆయన సోదరుడు విష్ణుజోషీ. వారు నా గాయాలు కడిగి మందు వేసి కట్టుకట్టారు. ఓ వారం రోజులు వాళ్ళింట్లో ఆతిథ్యం ఇచ్చారు. వారి పరిరక్షణలో నేను పూర్తిగా కోలుకొన్నాను. మరలా హరిద్వార్ వైపు నా పాదయాత్రను కొనసాగిస్తానని వారితో చెప్పాను. వారు నన్ను నడవవద్దన్నారు. వారిలో ఒకరు నాతో పాటు హరిద్వార్ వరకూ రైలులో తోడు రావడానికి సంసిద్ధతను వెలిబుచ్చారు. నేను ససేమిరా వద్దన్నాను. కాలినడకనే ప్రయాణం కొనసాగిస్తానన్నాను. చివరికి వారు అంగీకరించి, నన్ను సాగనంపారు. వారు నాపై చూపిన ప్రేమానురాగాలు ఎన్నటికీ మరువలేనివి.



1935 ఫిబ్రవరి 7న కంఖల్ రామకృష్ణ సేవాశ్రమం చేరాను. నాకక్కడ ఓ పెద్ద స్వామి కనిపించారు. స్వామీజీకి వినమ్రంగా పాదాభివందనం చేశాను. 'నీవు బొంబాయి నుంచి వచ్చిన నారాయణవా?' అని అడిగారు. 'అవు'నన్నాను. 'నువ్వు వస్తున్నట్లుగా స్వామి అఖండానందజీ నాకో ఉత్తరం వ్రాశారు' అని ఆయన నాతో చెప్పారు. నన్ను సాదరంగా ఆహ్వానించింది సాక్షాత్తూ స్వామి వివేకానంద శిష్యులైన స్వామి కల్యాణానందజీ మహరాజే అని తెలుసుకొని, అంతులేని ఆనందం పొందాను. కంఖల్ ఆశ్రమ జీవితం మరుపురానిది".

పూజ్య స్వామి సర్వగతానందజీ ఒక అసాధారణమైన సన్న్యాసి, గొప్ప కర్మ యోగి. లక్ష్య సాధన కోసం తదేక దీక్ష, పట్టుదల, సేవా దృక్పథం గల ఆయన కంఖల్ ఆశ్రమంలో స్వామి కల్యాణానందజీ పర్యవేక్షణలో రోగి నారాయణ సేవలో తరించారు.

పరిచర్యలో పొందిన పరమానందం:

స్వామి రంగనాథానందజీ రంగూన్ నుండి ఢాకా వరకూ నడిచి వెళ్ళారు. బేలూరు మఠం చేరేసరికి వారి బరువు 36 కిలోలకి పడిపోయి, ఎముకల గూడులా తయారయ్యారు. వారి ఆరోగ్యం పూర్వ స్థితికి రావడానికి బేలూరు మఠ అధికారులు కంఖల్ సేవాశ్రమానికి పంపించారు. అప్పుడు నారాయణ మహరాజ్ స్వామి రంగనాథానందజీకి అహర్నిశలూ అత్యంత భక్తి శ్రద్ధలతో సేవ చేశారు. నాలుగు నెలల్లోనే స్వామి రంగనాథానందజీ ఆరోగ్యస్థితి మెరుగైంది. నారాయణ మహరాజ్ చేసిన సేవలను స్వామి రంగనాథానందజీ ఎంతో ప్రశంసించారు. వారి ఆరోగ్యం పూర్తిగా నయమయ్యాక బేలూరు మఠ అధికారులు వారిని కరాచీ ఆశ్రమ బాధ్యతను చేపట్టమని కోరారు. తన వద్ద పని చెయ్యడానికి స్వామి సర్వగతానందజీని పంపించినట్లైతే తాను వెంటనే కరాచీ వెళతానని స్వామి రంగనాథానందజీ అన్నారు. దాంతో, బేలూరు మఠం కోరిక మీద నారాయణ మహరాజ్

మిగతా 30వ పేజీలో...

భగవద్గీత వ్యక్తిత్వ వికాసం

– ఆకెళ్ల రాఘవేంద్ర

కురుక్షేత్రంలో... అటు కౌరవసేన, ఇటు పాండవసేన యుద్ధానికి సన్నద్ధమవుతున్నాయి. అతిరథ మహారథులంతా సమరానికి సంసిద్ధంగా ఉన్నారు. శ్రీకృష్ణుడు రథాన్ని నడుపుతున్నాడు. ఆ రథంలో అర్జునుడు ఆసీనుడై ఉన్నాడు. ఇంకో నిమిషంలోనో, అరనిమిషంలోనో బాణాలు సంధించడం తరువాయి. ఎదురుగా ఉన్న కౌరవసేనను అర్జునుడు చూశాడు. భీష్మ, ద్రోణ, దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, వికర్ణాదులను వీక్షించాడు. అంతే! అర్జునుడి వెన్నులో సన్నని వణుకు. "కృష్ణా! నేను యుద్ధం చేయలేను" అని అన్నాడు అర్జునుడు.

అప్పుడు అర్జునుడికి (18 అధ్యాయాల్లో) 700 శ్లోకాల్లో సుదీర్ఘ ఉపన్యాసమిచ్చాడు కృష్ణుడు. నాటికీ, నేటికీ, ఏనాటికీ ఉపకరించే సమాచారం అది. జీవితంలోని అయోమయాల్ని తీర్చి గమ్యాన్ని చేర్చే దిక్సూచి అది. దాని పేరే **భగవద్గీత!**

ఆ గీతోపదేశాన్ని శ్రీకృష్ణుడు ప్రశాంత వాతావరణంలో చేయలేదు. చల్లని గాలులు వీచే తపోవన ఆశ్రమ ప్రాంగణంలో చేయలేదు. హాయిగా పురాణ కాలక్షేపంలా ఓ దేవాలయంలో చెప్పలేదు. మరెక్కడ చెప్పాడు?

యుద్ధరంగంలో చెప్పాడు. కల్లోలమైన మనస్సుకు ధైర్యాన్ని బోధిస్తూ చెప్పాడు. జీవన్మరణ సమస్యలకు పరిష్కారం చెప్పాడు. కష్టాలు వస్తే ఎలా చిరునవ్వు చిందిస్తూ ఉండాలో చెప్పాడు. స్థైర్యాన్ని, ధైర్యాన్ని ఎలా పొందాలో చెప్పాడు. అన్నింటికీ మించి – అసలు మనిషిగా 'నువ్వేం సాధించాలో' చెప్పాడు.

శ్రీకృష్ణుణ్ణి, వ్యాసుడిని స్తుతించే గీతాధ్యాన శ్లోకాల్లోని నాలుగో శ్లోకం ఇలా చెబుతోంది: "ఉపనిషత్తులు అనే కామధేనువు నుంచి శ్రీకృష్ణుడు అనే గోవుల కాపరి పితికిన పాలు – 'భగవద్గీత'. అర్జునుడు లేగదూడ". అయితే గోవు ఇచ్చిన పాలన్నీ కేవలం లేగ దూడ తాగలేదు. మిగిలిన పాలు ప్రజలవి. గీతామృతం కూడా ఒక్క అర్జునుడికే కాదు. తరతరాల యుగ యుగాల భారతీయులందరికీనూ!

'శతాబ్దాలుగా మనం దుఃఖించాం. దుఃఖించినది ఇక చాలు' అంటారు స్వామి వివేకానంద. అదే విధంగా శతాబ్దాలుగా ఆ గీతామృతాన్ని మనం పూజలకే పరిమితం చేశాం. పూజించింది చాలు. ఇక మనం ఆ పాలను తాగాల్సిన సమయం ఆసన్నమైంది. తాగి – నరనరానా, కణకణానా జీర్ణించుకోవాల్సి ఉంది. ఆ పాలు అందించే శక్తి శరీరమంతా వ్యాపించాల్సి ఉంది. ఆ పాలు నేల పాలు కాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉంది.

మీరు ఓ నది దాటాలి – దానిపేరు జీవితం. ప్రస్తుత స్థితి, లక్ష్యం అనేవి అటూ ఇటూ ఉన్న రెండు ఒడ్లు. అంటే మీరు ఇప్పుడున్న తీరం నుంచి లక్ష్యం అనే తీరానికి చేరుకోవాలి. కాలం ఆ నదిలోని నీరులా ప్రవహిస్తుంది. కాలవాహిని అలల వాలున మీరు ఎదురీది, సాఫల్యం సాధించాలి.

సమస్యల సుడిగుండాలు, కష్టాల తిమింగలాలు ఉండనే ఉన్నాయి. అయినా మీరు పయనించక తప్పదు. తీరం చూడక తప్పదు. సంకల్పం అనే పడవలో మీరు చేసే ప్రయాణానికి శ్రీకృష్ణుడే నావికుడు! భగవద్గీతే దిక్సూచి!!

ఈనాడు మనిషి ఆందోళనలకూ, ఒత్తిళ్ళకూ నిలయంగా మారాడు. నరాల బలహీనతకు కర్మాగారంగా, ఆత్మహత్యలకు కేంద్రంగా మారాడు. మానసిక దృఢత్వాన్నీ, ఆంతరంగిక అభివృద్ధినీ విస్మరించడమే దీనికి కారణం. మనిషి బయటకు ప్రయాణం చేస్తూ తనలోకి ప్రయాణించడం మరిచిపోవడమే ఇందుకు కారణం.

ఈ రహస్యాన్ని కొన్ని పదుల శతాబ్దాల కిందటే కృష్ణుడు గుర్తించాడు. ఈనాడు మన ఆత్మహత్యలకు కారణం ఆంతరంగికమైన ఆందోళన అన్న విషయాన్ని ఆనాడే కృష్ణుడు గుర్తించాడు. ఆ రహస్యాల విశేషాల్ని భగవద్గీతలో గుదిగుచ్చి చెప్పాడు శ్రీకృష్ణుడు. అదీ భగవద్గీత విశిష్టత.

నీవు నీ పని చేసుకుంటూనే, స్వచ్ఛమైన, సమర్థమైన సహాయకారిగా సమాజానికి ఉపకరించాల్సిందిగా చెబుతోంది – గీత. జీవితంలోనే యోగులుగా ఉండమంటోంది – గీత. జీవించడంలోనే యోగత్వం పొందమంటోంది – గీత. నీవు పని చేస్తూ, అందరితో పాటు జీవిస్తూ, నీ మనస్సును క్రమపద్ధతిలో ఉంచుకోమని ఉద్ఘోషిస్తోంది – గీత. అలజడి వస్తే అదిరిపోకుండా, కష్టం వస్తే కుంగిపోకుండా యుద్ధం

చేయమంటోంది – గీత. ఆగ్రహాన్ని నిగ్రహించుకుని, ఆవేశాన్ని అణచుకొని, కోపాన్ని అదిమి పెట్టుకుని ప్రశాంతంగా ఉండమంటోంది –గీత.

నీలో ఉన్న దివ్యకాంతిని ముందుగా నిన్ను గుర్తించ మంటోంది – గీత. అలా గుర్తించి ఆ వెలుగుతో నువ్వూ, లోకమూ కాంతిమయం కావాలంటోంది – గీత.

న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।
న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥ *(భగవద్గీత 5.14)*

"పరమేశ్వరుడు మానవులకు కర్తృత్వాన్ని గానీ, కర్మలను గానీ, కర్మసంయోగాన్ని గానీ సృష్టించడు. అతని స్వభావమే అలా ప్రవర్తించేలా చేస్తోంది".

అంటే ఏ పనైనా చేయడం చేయకపోవడం, బాగా చేయడం, చెడుగా చేయడం – ఇవన్నీ 'మానవ స్వభావం' ద్వారా జరుగుతున్నాయి. 'స్వభావస్తు ప్రవర్తతే' అనే దాన్ని బాగా అర్థం చేసుకోవాలి. నీలోని స్వభావమే నీవు నడవడానికి కారణం. నీలోని స్వభావం – సరైనది కాకపోతే, దుష్టబుద్ధి అయితే, కోపోద్రిక్తం అయితే, ఆందోళనా పూరితమైతే, ఆనందించలేనిదైతే, ఆకతాయిది అయితే, అంతులేని ఆశల వలయమైతే, అంతూ పొంతూ లేని అనుమానం ఉంటే నీ ప్రవర్తన తదనుగుణంగానే ఉంటుంది.

నీ స్వభావం – మంచిది అయితే, శాంతపూరితం అయితే, స్థితప్రజ్ఞత్వమైతే, ఆనందో బ్రహ్మ అయితే, నీ ప్రవర్తన తదనుగుణంగానే ఉంటుంది.

నిర్ణయించుకోవాల్సింది మీరే! తప్పుదోవలో పోతే, దుర్లక్షణాల బారిన పడితే ఆ బాధ్యత భగవంతుడు మోయడు. మీరే మోయాలి ఆ పాపపు భారాన్ని! మీ స్వభావాన్ని మీరు ఎంతగా మంచి వైపు మార్చుకుంటే మీకే అంత మంచిది!

మీరు ఎంతగా వ్యక్తిత్వ వికాసం కోసం తాపత్రయపడితే మీకు అంతకు రెట్టింపు లాభం.

భగవద్గీతలోని ఏడవ అధ్యాయంలోని తొలిశ్లోకంలో శ్రీకృష్ణుడు ఇలా అంటాడు: "అర్జునా! అనన్య ప్రేమతో నా యందు ఆసక్తి కలిగి ఉండి యోగంలో నిమగ్నమవ్వు – నన్ను తెలుసుకో". భగవద్గీతలో చాలా చోట్ల శ్రీకృష్ణుడు ఇలాగే పేర్కొనడం కనిపిస్తుంది. "నాపై ఆసక్తి కలిగి ఉండు, నా నిజస్వరూపం తెలుసుకో" అని పదే పదే అర్జునుడితో శ్రీకృష్ణుడు అంటాడు. ఇది కొంచెం స్వోత్కర్షలా అనిపించవచ్చు. కానీ దీని వెనుక ఒక అద్భుతస్ఫూర్తి దాగుంది.

జీవితంలో అన్ని కోణాలలో విజయం సాధించిన వ్యక్తి నుంచి స్ఫూర్తి పొందడం, అతనిని అనుసరించడం ఏమీ చెడ్డపని కాదు కదా! అందుకే శ్రీకృష్ణుడు ప్రతీసారీ ఆ మాట అంటున్నాడు.

ఆ కృష్ణుణ్ణి అర్జునుడు అనుసరించాడు. అందుకే ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో అజేయుడై నిలిచాడు. ఆయన భగవద్గీతలో చెప్పిన చక్కని చిట్కాలతో మనమూ ఆయనను అనుసరిస్తూ ముందుకు సాగుదాం. 'అబ్బే అదేం కుదరదు. మేం నాస్తికులం– శ్రీకృష్ణుడు దేవుడేంటి' అంటే అలాగే కానివ్వండి. కానీ ఆ చిట్కాల్ని గొంతులో పోసుకొని, నరనరానా జీర్ణించుకోవడంలో తప్పేముంది! 'అయినా కుదరదు సార్' అంటే ఓ పని చేయండి. ఆ కృష్ణుడి స్థానంలో మీకు తెలిసిన సక్సెస్‌ఫుల్ పర్సన్ పేరు పెట్టుకోండి. గాంధీ, ఐన్‌స్టీన్, స్వామి రంగానాథానంద, మీ నాన్నగారు... మీ ఇష్టం. ఆ ప్రముఖుల జాబితా ఏదైనా కావచ్చు. వారి నుంచి స్ఫూర్తి పొంది, మంచి లక్షణాల్ని పొందుతూ ముందుకు సాగండి. అప్పుడు 'యుద్ధంలో గెలుపు' మీదే! ఆనాడు కురుక్షేత్రంలో పాంచజన్య శంఖారావంతో శ్రీకృష్ణుడు చెప్పింది ఇదే కదా! అర్జునుణ్ణి కర్మవీరుడైన అనాసక్తయోగిగా మార్చి, కర్తవ్యాన్ని నూరిపోసింది ఇదే కదా! జీవితమనే యుద్ధరంగంలో అన్నీ ఉండి అసంతృప్తితో రగిలిపోతున్న వారికి స్థిత ప్రజ్ఞత్వం అనే ఔషధాన్ని అందించిందీ ఇదే కదా! "ఏం కావాలో తెలియడం లేదు గానీ మొత్తం మీద ఏదో కావాలి. ఆ 'ఏదో' ఎక్కడ, ఎప్పుడు, ఎలా దొరుకుతుంది" లాంటి ప్రశ్నలతో కాగి, కాలిపోతున్న వారికి సమాధానం కూడా ఇదే కదా! అదే కదా గీతాసారాంశం విశిష్టత!! ❖

యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

శ్రీచైతన్య, విశాఖపట్నం.

ప్రశ్న: నేను ఇంటర్మీడియట్ చదువుతున్న ఫస్ట్ ర్యాంక్ విద్యార్థిని. చదువుతున్న సమయంలో స్నేహితులు వచ్చి కబుర్లతో కాలక్షేపం చేస్తున్నారు. అందువల్ల చదువులో వెనుకబడ్డాను. మాట్లాడకపోతే స్నేహితుల మనస్సును నొప్పించినవాడిని అవుతానేమోనని భయం. స్నేహితులను బాధ పెట్టకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ఎలా?

జవాబు: విద్యార్థి దశలో సినిమాలు, షికార్లు, కబుర్లతో కాలాన్ని దుర్వినియోగం చెయ్యడం సహజం. దీనికి కారణం విద్యార్థులకు సమయం విలువ తెలియకపోవడమే.

సమయాన్ని వృథా చేయడం వల్ల జీవితంలో కలిగే అనర్థాలను గురించి అనుభవజ్ఞులు చెప్పిన విషయాల్ని గమనించండి:

1. విద్యార్థి దశలో సమయాన్ని సద్వినియోగం చేసుకోకపోతే తరువాత జీవితమంతా దుర్వినియోగం అవుతుంది. కాబట్టి జీవన సౌధ నిర్మాణానికి ప్రతీ క్షణమూ అత్యంత ఉపయుక్తమైనదని గ్రహించాలి.

Time is life, and if we kill time, it will kill our life... I recommend you to take care of minutes, for the hours will take care of themselves.

- Lord Reymond

2. అవసరానికి మించి మాట్లాడడం వల్ల సమయం, శక్తి రెండూ నష్టమవుతాయి. అందువల్ల మాటల్లో శక్తిని వృథా చేయకుండా కూడబెట్టాలి అంటారు స్వామి వివేకానంద.

Do not spend your energy in talking, accumulate power in silence... *- Swami Vivekananda*

3. ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వం అతని ఆలోచనా సరళి, సమయాన్ని వినియోగించడం అనే రెండు అంశాలపై ఆధారపడి ఉంటుంది.

Character is the result of two things - mental attitude and the way we spend our time. *- Elbert Hubbard*

స్నేహితులతో మాట్లాడకపోతే వారి మనస్సును నొప్పించిన వాణ్ణి అవుతానేమోననే సందిగ్ధావస్థ నుంచి బయట పడడానికి సోక్రటీస్ తన మిత్రునిపై ప్రయోగించిన 'త్రిసూత్రం' మీరు కూడా పాటించండి.

దీర్ఘాలోచనలో ఉన్న సోక్రటీస్ దగ్గరకు ఆయన స్నేహితు డొకడు వచ్చి 'నీకు ఒక విషయం చెబుతాను విను' అని అన్నాడు. వెంటనే సోక్రటీస్ ఆ విషయమేమిటో చెప్పమని అంటే సమయం వృథా అవుతుందేమోననీ, చెప్పవద్దంటే మిత్రుడు బాధపడతాడేమోననీ ఆలోచించి 'త్రిసూత్ర' ప్రయోగం చేశాడు.

సోక్రటీస్ తన మిత్రుణ్ణి 'నీవు చెప్పాల్సిన విషయంలో సత్యమేమైనా ఉందా' అని ప్రశ్నించాడు. అందుకు అతని మిత్రుడు 'ఈ విషయం ఒకరి దగ్గర నుంచి విన్నది మాత్రమే!' అని బదులిచ్చాడు. అప్పుడు సోక్రటీస్ 'చెప్పే ఏ విషయమైనా సత్యమని రూఢి కానప్పుడు ఆ విషయాన్ని గురించి చర్చించడం వల్ల ఇద్దరికీ ఎలాంటి ప్రయోజనమూ ఉండదు' అని మిత్రుడితో అన్నాడు.

అంతటితో ఆగకుండా సోక్రటీస్ 'నీవు నాకు చెప్పాల్సిన విషయంలో ఏదైనా మంచి ఉందా?' అని మిత్రుణ్ణి అడిగాడు. మిత్రుడు 'లేదు' అని బదులిచ్చాడు. ఇప్పుడు సోక్రటీస్ మిత్రుణ్ణి మూడో ప్రశ్న అడిగాడు: 'నీవు చెప్పాల్సిన దాంట్లో మనకు ఉపయోగపడే విషయం ఏమైనా ఉందా?' మిత్రుడి నుంచి 'లేదు' అనే సమాధానం వచ్చింది.

సమాధానాలు విన్న తరువాత సోక్రటీస్ తన మిత్రునితో, 'నీవు చెప్పబోయే విషయం సత్యమూ కాదు, మంచి విషయమూ కాదు, ప్రయోజనకరమైనదీ కాదు. అలాంటి విషయాల్ని చర్చించు కోకుండా ఉండడం మంచిది' అని సున్నితంగా చెప్పి సంభాషణను నిలిపివేశాడు. మనం కూడా సోక్రటీస్ త్రిసూత్రాన్ని నిత్యజీవితంలో పాటించగలిగితే ఉన్న సమయ మంతా మనదే అవుతుంది. ఇక ప్రయత్నించి చూడండి. ❖

మీ సందేహాల్ని పంపాల్సిన చిరునామా :
యువవాణి
శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029

మనసా... నీ పయనమెటు?

– స్వామి సేవ్యానంద

ఓ ఆశ్చర్యకరమైన విషయం: మహాభారతంలో యక్షుడు, యుధిష్ఠిరుణ్ణి "ఈ లోకంలో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటి?'' అని ప్రశ్నించాడు. సమాధానంగా యుధిష్ఠిరుడు – "ఈ ప్రపంచంలో నిత్యం ఎంతో మంది మరణిస్తున్నప్పటికీ, మిగిలిన వారంతా శాశ్వతంగా జీవించాలనే కోరుకుంటారు. ఇంతకన్నా ఆశ్చర్యకరమైన విషయం ఏముంది?" అని చెప్పాడు.

మనకు ఎంతో ప్రియమైన ఆస్తిపాస్తులు, సుఖభోగాలు, పేరు ప్రఖ్యాతులు, అన్నిటినీ మించి ఈ శరీరం ఎంతవరకు శాశ్వతం? శరీరంతో పాటు ఇవన్నీ ఏదో ఒక రోజు అంతం కావలసిందే కదా! ఆహ్వానం లేని అతిథిలా మనకు ఎదురయ్యే మృత్యుదేవతను తప్పించుకోవడం ఎవరికి మాత్రం సాధ్యం? ఈ శరీరం దహనమై, బూడిదగా మారిన తరువాత కూడా మనలో శాశ్వతంగా ఉండేది ఏమైనా ఉందా? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడంలో 'శాస్త్రీయ విజ్ఞానం' పూర్తిగా విఫలమైంది. మన హృదయంలో ఆసీనమై ఉన్న 'ఆత్మ' శాశ్వతమైనదనీ, ఈ ఆత్మను సాక్షాత్కరించుకొని మనమంతా జనన మరణాలకు అతీతమైన ఉన్నతమైన స్థితిని చేరుకోగలమనీ, శాశ్వతమైన ఆనందాన్ని అనుభవించగలమనీ చెబుతుంది – ఆధ్యాత్మిక విజ్ఞానం.

ఆధ్యాత్మిక విషయాలను మనం ఎందుకు విశ్వసించాలి? : మతం పేరుతో రోజు రోజుకీ పెరుగుతున్న అత్యాచారాల ఫలితంగా నేటి యువతరంలో ఆధ్యాత్మిక జీవితంపై మంచి అభిప్రాయం, సరైన అవగాహనా లేకుండా పోయాయి. నేడు ఆధ్యాత్మిక విషయాలపై శ్రద్ధా విశ్వాసాలు లేకుండా ఉండడం 'ఆధునికత' అయింది. ఆధ్యాత్మిక విషయాలను మనం విశ్వసించాల్సిన అవసరం లేదు. వీటిని అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలి. "మానవునిలో అంతర్గతంగా ఉన్న దివ్యత్వాన్ని వ్యక్తం చేయడమే – మతం" అని స్వామి వివేకానంద చెప్పారు. భౌతిక విషయాలను శాస్త్రీయ విజ్ఞానం సహాయంతో నిరూపించిన వారిని 'శాస్త్రజ్ఞులు' అన్నట్లే, ఆధ్యాత్మిక సత్యాలను ముఖాముఖీ సాక్షాత్కరించుకొన్న వారిని ఋషులనీ, ప్రవక్తలనీ అంటాం. వీరు కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఈ సత్యాలను సాక్షాత్కరించుకొని, మన కోసం ఆధ్యాత్మిక మార్గాన్ని తయారు చేశారు. ఈ మార్గాన్ని అనుసరిస్తే మనమంతా ఋషులం, మహాపురుషులం, అనంతమైన ఆనందానికి అధికారులం కాగలం.

మనం ఏ స్థితిలో ఉన్నాం?: నేటి వేగవంతమైన జీవితంలో, ఉన్న కొద్ది రోజులూ వీలైనంత సుఖాన్ని అనుభవించడమే తెలివైన పనిగా చాలా మంది భావిస్తున్నారు కానీ, ఉన్నతమైన జీవితాన్ని గడపాలనీ, శాశ్వతమైన ఆనందాన్ని ఆస్వాదించాలనీ ఎంత మంది కోరుకుంటున్నారు? మనం ఏ స్థితిలో ఉన్నామో తెలుసుకున్నప్పుడే ఇంతకన్నా ఉన్నతమైన స్థితికి వెళ్ళే అవకాశం ఉంటుంది.

శ్రీరామకృష్ణులు చెప్పిన ఒక కథ ద్వారా ఈ విషయాన్ని అర్థం చేసుకోవచ్చు: "బెస్తవాడు చేపల్ని పట్టడానికి ఒక చెరువులో వల విసురుతాడు. కొన్ని చేపలు ఎంత తెలివైనవంటే అవి ఎప్పుడూ వలలో చిక్కుకోవు. అవి 'నిత్యముక్తుల' కోవకు చెందినవి. వలలో చిక్కుకున్న చేపల్లో కొన్ని పారిపోవడానికి ప్రయత్నిస్తాయి. అవి 'ముముక్షు జీవుల' లాంటివి. కానీ, వీటిలో చాలా కొద్ది చేపలు మాత్రమే వల నుండి తప్పించుకొని నీళ్ళలోకి గెంతుతాయి. ఇవి 'ముక్త జీవుల' లాంటివి. అయితే, వలలో పడ్డ చేపల్లో అత్యధిక భాగం తప్పించుకోలేవు, తప్పించుకునే ప్రయత్నం కూడా చెయ్యవు. పైగా వల త్రాటిని నోట కరచి పెట్టుకొని, బురదలో దూరి, 'మేం ఇక్కడ సురక్షితంగా ఉన్నాం, ఇంకేం భయం లేదు' అనుకుంటాయి. కాసేపట్లో బెస్తవాళ్ళు వలతో సహా లాగి, తమను గట్టు మీద పడవేస్తారని వీటికి తెలియదు. ఇవి 'బద్ధజీవుల' వంటివి." మనలో ఎక్కువమంది ఈ బద్ధజీవుల తరగతికి చెందినవారే!

ఈ విలువైన మానవ జీవితాన్ని అశాశ్వతమైన ప్రాపంచిక భోగాల కోసం వృథా చేయకుండా శాశ్వత ఆనందం కోసం సద్వినియోగ పరచుకుందాం. ❖



మనసు-మర్మం - స్వామి బుధానంద

మనో నియంత్రణకు మార్గం!

మనస్సును స్వాధీనం చేసుకోవడం అన్ని కాలాలలోనూ ధీరులైన వారికి సైతం కష్టమైన పనే! అయితే, అది అసాధ్యం మాత్రం కాదు. దాన్ని సాధించడానికి చక్కగా నిర్వచించిన, నిర్దేశించిన పద్ధతులు కొన్ని ఉన్నాయి.

మనస్సును స్వాధీనం చేసుకోవడంలోని రహస్యాన్నంతా శ్రీకృష్ణుడు రెండు మాటలలో ఇమిడ్చి బోధించాడు. అవి: అభ్యాసం, వైరాగ్యం.

పై రెంటినీ మన జీవితంలో ఆచరణలోకి తీసుకురావాలంటే – మనస్సును స్వాధీనం చేసుకోవాలన్న దృఢమైన సంకల్పాన్ని పెంపొందించుకోవాలి; మన మనస్సు స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. సంకల్పశక్తిని మరింత బలమైనదిగా చేయడానికి ముందుగా సుఖాలపై మనకున్న కోరికలను చంపుకోవాలి. మనస్సును స్వాధీనం చేసుకోవడంలో ఇమిడి ఉన్న లాభాలేమిటో అర్థం చేసుకోవాలి. మనస్సును సద్విషయాలతో నింపడానికి అనుకూలమైన అంతర్గత వాతావరణం అవసరం.

మనస్సు ఎంత పవిత్రమైనదైతే దాన్ని స్వాధీనం చేసుకోవడం అంత సులభం. కాబట్టి మనం మనస్సును పరిశుద్ధం చేయడానికి సాధనలు చెయ్యాలి. మన స్వభావంలో సత్త్వగుణాన్ని బలపరచి, అదే గుణాన్ని మరింత పరిశుద్ధం చేయడం ద్వారా దాన్ని కూడా అధిగమించడమే మన లక్ష్యం.

సాధనలను సమర్థంగా అభ్యాసం చెయ్యడానికి సూచించిన కొన్ని చర్యలను జాగ్రత్తగా అనుసరించాలి. ఈ చర్యలు ఏమిటంటే:

1. సామరస్యమైన మానవ సంబంధాలను కలిగి ఉండడం;
2. మనస్సుకు ఆరోగ్యకరమైన కాలక్షేపాన్ని చూపడం;
3. ఊహాశక్తిని సరిగ్గా ఉపయోగించడం;
4. నిరాశా నిస్పృహలకు లోను కాకుండా ఉండడం.

మనస్సును స్వాధీనం చేసుకోవడానికి ధ్యానం గొప్పగా సహకరిస్తుంది. అలాగే, స్వాధీనమైన మనస్సు, ధ్యానానికి సహకరిస్తుంది.

అత్యవసర పరిస్థితులలో వాడడానికి అవసరమైన నిరోధకాల (బ్రేకుల) గురించి పతంజలి మహర్షి సూచించిన పద్ధతి – పవిత్రమైన ఆలోచనలూ, నిరంతరం భగవన్నామాన్ని స్మరించడం, భగవంతుణ్ణి శరణువేడడం.

మనస్సు యొక్క చైతన్యరహిత స్థితిని నియంత్రించకుండా మనస్సును స్వాధీనం చేసుకోలేం. చైతన్యరహిత స్థితిని నియంత్రించడానికి దానిలో పవిత్రమైన ఆలోచనలను ధారగా పోయడం ఒక పద్ధతి. ప్రాణాయామం, భక్తి మొదలైనవి ఇతర పద్ధతులు. పై పద్ధతులన్నీ మనిషిలో నిద్రాణమై ఉన్న ఆధ్యాత్మిక శక్తి, 'కుండలిని'ని మేలుకొలపడానికి సహాయపడతాయి.

మనస్సును స్వాధీనం చేసుకోవడంలో భగవంతుణ్ణి నమ్మిన వారిదే పైచేయి. భగవంతుని పట్ల ప్రేమను కలిగి ఉండడమే మనస్సును స్వాధీనం చేసుకోవడానికి సులభమైన పద్ధతి. ❖

With Best Compliments From

PENNAR INDUSTRIES LIMITED

305, Saptagiri Towers, Begumpet, Hyderabad - 500 016

పెన్నార్ కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

(1884-1967)

ముందుకు సాగిపో!

- స్వామి ప్రేమేశానంద

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ -వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

హృషీకేశ్
12-4-1930

ప్రియమైన శశాంక్!

నీవు నీ గురువును చూడడానికి వెళ్ళలేకపోయినందుకు బాధపడుతున్నావు. కానీ ఆయనను చూడడం కన్నా నీ విచారమే నీకు ఎక్కువ ఉపయుక్తమైనది. గురువును చూడలేకపోయాననే అనే విచారం ఆయన పట్ల నీ ఆకర్షణను పెంచుతోంది కదా!

పురుషకారం, అదృష్టం అన్నవి రెండు విభిన్న శక్తులు కావు. గతంలో చేసిన స్వప్రయత్నం ఏదైనా సంచితంగా మిగిలి, తర్వాతి కాలంలో అది ఆవిష్కృతమైనప్పుడు, బహుశః స్వర్గంలోని ఏ దేవుడో దానికి కర్త అని జనం భావిస్తుంటారు. వారు వారి గత జన్మల్లో ఎన్నెన్ని మంచి పనులూ, చెడ్డ పనులూ చేశారో వారికి తెలియదు.

ఒక్కటి గమనించు! జీవుడు భౌతికమైన శరీరానికి అధిపతి అయినప్పటికీ జీర్ణక్రియ లాంటి అంతర్గత చర్యల మీద అతని అదుపు ఏమీ ఉండదు. ఎలాగంటే మనం ఒక గుఱ్ఱం మీద కూర్చొని దాన్ని నడుపుతున్నప్పటికీ, నిజానికి అదే మనల్ని తీసుకుపోతుంటుంది. పని అనేది నా ఆధీనంలోనే ఉన్నా, ఒకసారి అది చేసేశాక దాని ఫలితాల మీద నా అదుపు ఏమీ ఉండదు. మనం గత జన్మలలో ఏమేమి చేశామో జ్ఞాపకం లేదు. అందుచేత మనం ప్రయత్నం వల్లనో, అప్రయత్నంగానో సత్ఫలితాలను పొందినప్పుడు అది స్వర్గంలోని భగవంతుడిచ్చిన కానుకగా భావిస్తుంటాం. ఫలితాలు వ్యతిరేకమైనవైతే, దాన్ని భగవంతుని ఆగ్రహానికి కారణంగా భావిస్తాం.

గత జన్మలో నేను అనేక దుష్కార్యాలు చేసి ఉండాలి. అందుకే ఇప్పుడు దారిద్ర్యం అనుభవిస్తున్నాను. నా జాతక చక్రం పరిశీలించిన ఒక జ్యోతిష్కుడు "శని ఆగ్రహించాడు" అని చెప్పాడు. అందుచేత నా దోషాలన్నిటికీ కారణం శని ప్రభావం అని నేను అర్థం చేసుకున్నాను. కానీ శని ఆగ్రహానికి కారణమైన నా గతజన్మ చర్యలేవీ నా జాతక చక్రంలో వ్రాసి లేవు. కాబట్టి నా 'అదృష్టం' అనేది నా పూర్వకర్మల ఫలితమేనని స్పష్టమవుతోంది.

భగవద్గీతలో ఎక్కడా 'అదృష్టం' గురించి నొక్కి చెప్పిన సందర్భం లేదు. 'పురుషకారం' గురించి గీత కొంత ప్రత్యేకంగా చెప్పింది. భగవంతుని వద్ద శరణాగతి పొందడం మరొక అంశం. జీవుడు అహంకారం, స్వప్రయత్నం అనే ఆలోచనల నుంచి ఎప్పుడు విడివడతాడో అప్పుడు నిష్క్రియుడై, అతని కర్మ ముగుస్తుంది. జీవుడు జ్ఞానాన్ని పొందడం వల్ల సర్వాన్నీ, అంటే స్వప్రయత్నాన్నీ, దాని ఫలితాన్నీ కూడా భ్రాంతిగా చూస్తాడు, భగవంతుడే అన్నీ చేసేవాడు, అనుభవించేవాడు అని తెలుస్తుంది. ఆ విధమైన జ్ఞానం కలిగాక భగవంతుడు ప్రేమస్వరూపుడు, దయామయుడు, అనుగ్రహ సాగరుడు అని అర్థమవుతుంది. ఈ స్థితికి చేరడానికి ముందే స్వప్రయత్నాన్ని ఆపివేస్తే జీవుడు వినాశానికి గురి అవుతాడు. దాన్ని గురించి ఆలోచించి ప్రయోజనం లేదు. నీవేమీ నిస్పృహకు గురి కాకు. హృదయాన్ని ఆనందంతో నింపుకొని మనస్సును నీ విధులపై లగ్నం చెయ్యి. నువ్వు సంతోషంగా ఉండు, ఇతరులను సంతోషంగా ఉంచు. నీ తల్లితండ్రులు ఆనందంగా ఉండేలా చూడు. ఓర్మితో భరించవలసినదంతా భరించు. ❖

ప్రేమాశీస్సులతో...
స్వామి ప్రేమేశానంద

తెలుగుసేత : కె. త్రివిక్రమరావు

... 23వ పేజీ తరువాయి

1943లో కరాచీ వెళ్ళారు. కంఖల్ విడిచి వెళ్ళాలని లేకపోయినప్పటికీ, స్వామి రంగనాథానందజీ పట్ల గల ప్రేమ వల్ల స్వామి సర్వగతానందజీ కరాచీ వెళ్ళి సేవ చేశారు.

సంఘ సేవలో అవిశ్రాంత కృషి : బోస్టన్ వెళ్ళాల్సిందిగా బేలూరు మఠం నుంచి ఆదేశం వచ్చే లోపు స్వామి సర్వగతానందజీ కొంతకాలం విశాఖపట్నం కేంద్ర అధికార బాధ్యతను నిర్వహించారు. 1954లో బోస్టన్‌లోని రామకృష్ణ వేదాంత సమాజానికి అధ్యక్షులుగా ఉన్న స్వామి అఖిలానందజీ మహరాజ్ సహాయకునిగా బోస్టన్ వెళ్ళారు. స్వామి అక్కడ రెండు ఆశ్రమాల అభివృద్ధికై తీవ్రంగా కృషి చేశారు. స్వామి అఖిలానందజీ మహాసమాధి అనంతరం 1962లో స్వామి సర్వగతానందజీ ఆ రెండు కేంద్రాలకూ అధ్యక్షులయ్యారు.

యాభై సంవత్సరాలకు పైగా స్వామి సర్వగతానందజీ ఒక్కరే రెండు కేంద్రాల బాధ్యతలనూ నిర్వహించారు. ఆశ్రమ నిర్వహణలో ఎదురైన అనేక సమస్యలనూ, తనకు ప్రాణహాని కలిగించే సంఘటనలనూ కూడా ప్రశాంతంగా ఎదుర్కోగలగడం శ్రీరామకృష్ణులపై సర్వగతానందజీకి గల అపార భక్తి విశ్వాసాలకు నిదర్శనం. పవిత్రమైన ఆదర్శాలతో వేల మందికి సాంత్వన కలిగించి ప్రభావితం చేసిన అసాధారణ వ్యక్తిత్వం స్వామీజీది.

స్వామి సర్వగతానందజీ వేదాంత సొసైటీలో చేసిన రాజయోగ ప్రసంగాలు అక్కడి మేధావుల్ని సైతం ఎంతో ప్రభావితం చేశాయి. ఆయన రాజయోగ ప్రసంగాలు రెండు సంపుటాలుగా ప్రచురితమయ్యాయి. ఆ గ్రంథాలను ఒక్కమారు చదివినా సరే, సర్వగతానందజీకి గల పరిజ్ఞానం ఎంత లోతైనదో పాఠకులకు ఇట్టే అర్థమవుతుంది.

'గుర్వాజ్ఞను' శిరసావహించిన ఉత్తమ శిష్యునిగా, 'మానవ సేవే మాధవ సేవ' అనే నవీన మంత్రాన్ని స్వీకరించి తరించిన ఉత్తమ సాధకునిగా, తప్త హృదయులకు శ్రీరామకృష్ణ సందేశామృతంతో సాంత్వన చేకూర్చి ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ఆదర్శ గురువుగా స్వామి సర్వగతానందజీ మహరాజ్ ప్రదర్శించిన ప్రతిభ అనన్యసామాన్యం. త్యాగం, ప్రేమ, సహనం, సేవాభావాలు సమ్మిళితమైన స్వామీజీ జీవితం మనందరికీ చిరస్మరణీయం, స్ఫూర్తిదాయకం. ❖

రామకృష్ణ మిషన్ సేవాశ్రమ

(పి.ఒ) ఆర్ట్స్ & సైన్స్ కాలేజి, క్యాలికట్-673018

ఫోన్ :0495-2320191, 2325345

Email: srkmaclt@bsnl.in

విన్నపం

చలపురంలోని ఒక అద్దె ఇంట్లో 1930లో రామకృష్ణ మిషన్ సేవాశ్రమం ప్రారంభమైంది. ఈ కేంద్రం 1945 నుండి విద్యా, వైద్య రంగాల్లో సేవలందిస్తోంది. ఆశ్రమ ఆధ్వర్యవంలో ఉన్నత పాఠశాల, మాధ్యమిక పాఠశాల, ఆర్థికంగా వెనుకబడిన, అనాథ బాలుర వసతి గృహం (హాస్టల్), ధార్మిక వైద్యశాలలను నిర్వహిస్తున్నాం.

60 ఏళ్ళ క్రితం నిర్మితమైన ఆశ్రమ, పాఠశాల, హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నిధుల కొరత కారణంగా ఆశ్రమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సాధ్యం కాలేదు. ఈ భవనం మరమ్మత్తులకూ, పునర్నిర్మాణానికీ, శాశ్వత నిధులకూ సుమారు రూ.1 కోటి 53 లక్షలు అవసరం.

I. మరమ్మత్తులు/ పునర్నిర్మాణాలకై అంచనా:

1. ప్రార్థనా మందిరం	రూ॥	10,00,000
2. వసతి గృహం, పఠనాలయం	రూ॥	6,00,000
3. వంటగది, భోజనశాల	రూ॥	5,00,000
4. కార్యాలయం	రూ॥	2,00,000
5. వైద్యశాల	రూ॥	3,00,000
6. సభాగృహం	రూ॥	2,00,000
7. పాఠశాల భవనాలు	రూ॥	15,00,000
8. ప్రహరీ గోడలు	రూ॥	10,00,000
II. 1) శాశ్వత నిధి- పూజ	రూ॥	50,00,000
2) శాశ్వత నిధి-సాధుసేవ	రూ॥	50,00,000
మొత్తం...	రూ॥	**1,53,00,000**

ఆశ్రమ సేవాకార్యక్రమాలను నిర్విఘ్నంగా కొనసాగించడానికి ఉదారహృదయులైన భక్తులు, శ్రేయోభిలాషుల నుండి విరాళాలను కోరుతున్నాం.

విరాళాలను Ramakrishna Mission Sevashrama, పేరున చెక్కు/ డి.డి. తీసుకొని, "Ramakrishna Mission Sevashrama, (P.O.) Arts & Science College, Calicut-673 018" కు పంపాల్సిందిగా మనవి. విరాళాలన్నిటికీ ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80(జి) కింద పన్ను మినహాయింపు ఉంది.

శ్రీరామకృష్ణులు, శ్రీమాత శారదాదేవి, స్వామి వివేకానందుల కృపకు పాత్రులు కాగలరని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో

స్వామి ప్రాణేశానంద

కార్యదర్శి

Advt.

భరతమాత చరణ సేవలో

వీర సింహం

భారతమాత అనేక మంది వీరపుత్రులను కని పునీతమైంది. అది 1927వ సంవత్సరం డిసెంబర్ 18వ తేదీ. ఓ మధ్య వయస్కురాలైన మహిళ గోరఖ్‌పూర్ సెంట్రల్ జైలు ప్రధాన ద్వారం వద్ద నిరీక్షిస్తోంది. జైలు అధికారుల నుంచి వచ్చే పిలుపు కోసం ఆమె వేచి ఉంది. మరునాడు మృత్యువును కౌగలించు కోనున్న సమరయోధుణ్ణి కలిసేందుకు జైలులోకి ప్రవేశించింది.



సంకెళ్ళతో బంధింపబడిన ఆ స్వాతంత్ర్య యోధుణ్ణి అక్కడకు తీసుకు వచ్చారు. చివరిసారిగా చూసి "అమ్మా" అని పిలువగలిగిన సమయమది. ఆ ఆలోచన మనస్సులో నిండగానే కళ్ళ నుండి అశ్రుధారలు ప్రవహించాయి. "ఇవేమిటి నాయనా? నా కొడుకును నేను గొప్ప వీరుడిగా ఊహించుకున్నాను. నా కొడుకు చావుకు భయపడతాడని నేనెప్పుడూ ఊహించలేదు" అంది ఆ తల్లి.

"అమ్మా! ఇవి భయంతో వచ్చిన కన్నీళ్ళు కాదు. ఆనంద బాష్పాలు. నీ లాంటి తల్లికి పుత్రుణ్ణైనందుకు నేను పొందుతున్న ఆనందమిది" అన్నాడు ఆ యోధుడు. అతడే 'రామ్‌ప్రసాద్ బిస్మల్'. కాకోరీ దోపిడీ సంఘటనలో ప్రధాన నాయకుడు.

భారతమాత దాస్యశృంఖలాలను త్రెంచడానికీ, భారతీయులకు స్వేచ్ఛా వాయువులను అందించడానికీ విప్లవ కార్యకలాపాల కోసం పెద్ద మొత్తంలో ధనం సేకరించాలన్న ఆలోచనతో మన దేశాన్ని దోచుకుంటూ ఇంగ్లాండుకు తరలిస్తున్న బ్రిటీషు ప్రభుత్వ ధనాన్ని మన సొంతం చేసుకోవాలని 1925 ఆగష్టు 9 న 'కాకోరీ' గ్రామం చేరుతున్న రైలును రామ్‌ప్రసాద్, మరో తొమ్మిది మంది విప్లవ సహచరులతో ఎంతో చాకచక్యంగా దోచుకున్నారు. ఆ కాకోరీ రైలు దోపిడీ ఉదంతం భారత విప్లవోద్యమ చరిత్రలో ఓ సంచలనాత్మక ఘట్టం. బ్రిటీషు ప్రభుత్వం గుండెల్లో రైళ్ళు పరుగెత్తించిన వీరుడు, సాహసి, ఉన్నత సంస్కారాలు మూర్తీభవించిన వ్యక్తి 'రామ్ ప్రసాద్'.

'మాతృభూమి కోసం ఎన్నిసార్లైనా ప్రాణాలను త్యజించడానికి నేను సిద్ధం. ప్రతి జన్మా భారతమాత సేవలో తరించవలసిందే' అంటూ ఉరికంబాన్ని కౌగలించుకొని, తన జీవితాన్ని భరతమాత పాదాల చెంత అర్పించిన వీర సింహం రామ్‌ప్రసాద్ బిస్మల్. ❖

చేసే మేలు చెప్పకూడదు! - స్వామి వినిశ్చలానంద

ఒక జెన్ గురువు తన శిష్యులతో సంచారం చేస్తూ ఓ గ్రామానికి చేరుకున్నారు. ఆయనకు ఆ గ్రామంలో ఒక వింత కనపడింది. అదేమంటే ఆ గ్రామంలో ఒక్క చెట్టు కూడా లేకుండా అన్నిటినీ మొదలు వరకూ నరికి వేశారు. కానీ ఒకే ఒక చెట్టును మాత్రం నరకకుండా అలానే ఉంచారు. ఇది చూసి ఆయనకు చాలా ఆశ్చర్యం కలిగింది.

వెంటనే ఆ జెన్ గురువు ఆ గ్రామ పెద్దను పిలిచి, "మీ గ్రామంలోని అన్ని చెట్లనూ నరికివేశారు కానీ, ఈ ఒక్కటీ ఏం పాపం చేసింది, దీన్ని ఎందుకు నరకలేదు" అని అడిగారు.

అందుకు ఆ గ్రామపెద్ద, "గురూజీ! ఈ చెట్టు ఎంత వంకర టింకరగా ఉందో చూడండి! ఇది ఏ పనికీ ఉపయోగపడదు. కనీసం వంట చెరకుగా కూడా పనికి రాదు. దాని వల్ల ప్రయోజనం ఏమిటి? అందుకే దాన్ని నరకకుండా వదిలివేశాం" అన్నారు.

అది వింటూనే ఆ జెన్ గురువు తన శిష్యులతో "చూశారా! సమాజానికి మనం ఉపయోగకరమైన పనులు చేసేవారమైనా ఆ విషయం బహిర్గతం చేయరాదు. ఆ రకంగా బహిర్గతం చేస్తే, ఈ చెట్లలానే మన జీవితాలు కూడా నాశనమవుతాయనే సత్యాన్ని తెలియజేస్తుంది" అన్నారు. ❖

రామకృష్ణ మఠం

విజ్ఞానానంద మార్గ్, ముఠిగంజ్, అలహాబాద్-211 003 (ఉత్తర ప్రదేశ్)
ఫోన్: 0532 - 2413369, ఫ్యాక్స్: 2415235 Email : rkmathald@dataone.in



త్రివేణీ సంగమ క్షేత్రంలో నూతన శ్రీరామకృష్ణ దేవాలయం

ప్రియమిత్రులారా!

ప్రయాగ (అలహాబాద్)లోని రామకృష్ణ మఠం 2010లో శతవార్షికోత్సవాలు జరుపుకోనుంది. ఈ శుభవార్త మీతో పంచుకోవడానికి ఆనందిస్తున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష శిష్యులలో ఒకరైన స్వామి విజ్ఞానానందజీ మహరాజ్ 1910లో ఈ మఠాన్ని ప్రారంభించారు. వారు ఆధ్యాత్మిక శక్తి సంపన్నులు, జీవన్ముక్తులు. స్వామి విజ్ఞానానందజీని రామకృష్ణ సంఘ ప్రథమ అధ్యక్షులూ, శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక పుత్రుడూ అయిన స్వామి బ్రహ్మానందజీ మహరాజ్ 'గుప్త బ్రహ్మజ్ఞాని' అనేవారు. విజ్ఞానానందజీ జీవితమంతా దివ్యదర్శనాలతో నిండి నది. ఆయన తమ 28 సంవత్సరాల తీవ్ర తపస్సాధనల దివ్యశక్తితో మఠ వాతావరణాన్ని ప్రభావితం చేశారు; మఠాన్ని సందర్శించే భక్తులు ఇప్పటికీ ఆ దివ్యశక్తి ప్రభావాన్ని అనుభూతి చెందుతారు.



ఈ ఆధ్యాత్మిక శక్తి చైతన్యాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో సాక్షాత్కరింప చేసుకొనే విధంగా భగవాన్ శ్రీరామకృష్ణుల విశ్వజనీన దేవాలయాన్ని నిర్మించాలని చాలా సంవత్సరాలుగా అనుకుంటున్నాం.

అందుకు ప్రస్తుత ప్రార్థనా మందిరాన్ని 2010లోగా దివ్యమైన ఆలయంగా తీర్చిదిద్ది, శ్రీరామకృష్ణుల చలువరాతి ప్రతిమను ప్రతిష్ఠించాలని నిశ్చయించాం. జాతి మత విచక్షణ లేకుండా అందరూ దేవాలయానికి వచ్చి ధ్యానం చేసుకోవచ్చు.

రామకృష్ణ మఠం, మిషన్‌ల అధ్యక్షులు శ్రీమత్ స్వామి ఆత్మస్థానందజీ మహరాజ్ 2008, ఏప్రిల్ 11న ఈ ఆలయానికి శంకుస్థాపన చేశారు. రానున్న జనవరి నెలలో ఆలయ మహాసంప్రోక్షణ జరుగనుంది.

ఈ బృహత్తర ఆలయ నిర్మాణానికి సుమారు కోటి రూపాయలు వ్యయమవుతాయని అంచనా. ఈ ఉన్నత కార్యార్థం మిమ్మల్ని ఉదారంగా విరాళాలు ఇవ్వవలసిందిగా కోరుతున్నాం.

రామకృష్ణ మఠానికి ఇచ్చే విరాళాలన్నిటికీ 1961 నాటి ఆదాయపు పన్ను చట్టంలోని 80 (జి) విభాగం ప్రకారం పన్ను మినహాయింపు లభిస్తుంది.

"Ramakrishna Math, Allahabad" పేరున చెక్కు/ డి.డి. తీసి Ramakrishna Math, Vijnanananda Marg, Mutthiganj, Allahabad-211 003 కు పంపాల్సిందిగా మనవి. దయచేసి మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఇంగ్లీషు, లేక హిందీ భాషల్లోనే జరపాల్సిందిగా వినతి.

భగవాన్ శ్రీరామకృష్ణుల అనుగ్రహం అందరి మీదా వర్షించాలని వారి పాదపద్మాల వద్ద ప్రార్థిస్తూ...

భగవత్సేవలో
స్వామి త్యాగాత్మానంద
అధ్యక్షులు

Advt.

స్వాధ్యాయం

– స్వామి రఘునాయకానంద

గురుకుల విద్యాభ్యాసం ముగించి ఇంటికి వెళుతున్న శిష్యుడికి గురువు మరొక్క సారి ఆతడు ఏ యే విషయాలలో శ్రద్ధ వహించాలో తైత్తిరీయ ఉపనిషత్తు ఇలా చెబుతోంది: 'సత్యాన్నే పలకాలి, ధర్మాన్ని ఆచరించాలి, శాస్త్రాల్లో నిర్దేశించిన కర్మలనే చేయాలి, స్వాధ్యాయాన్ని విడిచి పెట్టకూడదు.' ఇక, పతంజలి యోగసూత్రాల్లో తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వరప్రణిధానం – ఈ మూడింటినీ పతంజలి మహర్షి 'క్రియాయోగం'గా నిర్వచించారు.

మనల్ని మనం విశ్లేషించుకోవడమే స్వాధ్యాయం

స్వాధ్యాయం – స్వ అధ్యయనం అంటే మనల్ని మనం విశ్లేషించుకోవడం. An unexamined life is not worth living – ఆత్మ పరిశీలన లేని జీవితం జీవితమే కాదు అంటారు సోక్రటీస్. మనిషి అన్ని దశలలోనూ తనను తాను పరిశీలన చేసుకోవడం ద్వారా తనలోని లోపాలను సవరించుకొనే అవకాశం కలుగుతుంది. మనస్సులో వచ్చే ఆలోచనలకు క్రియారూపం ఇవ్వకుండా ప్రతి రోజూ గమనించడమే ఆత్మ పరిశీలన. ఈ ఆత్మ పరిశీలన మానసికంగా బలవంతులను చేసి, జీవిత పోరాటానికి సంసిద్ధం చేస్తుంది. మన ఆలోచనలే మన ప్రస్తుత స్థితికి కారణం. అందువల్ల ఆలోచనల విషయంలో జాగరూకత అవసరం. "Our thoughts make things beautiful, our thoughts make things ugly" అని అంటారు స్వామి వివేకానంద.

స్వాధ్యాయమంటే?

సాంప్రదాయిక అర్థంలో స్వాధ్యాయం అంటే ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాల పఠనమే. రామకృష్ణ మిషన్‌లో ఒక సీనియర్ స్వామీజీ స్వాధ్యాయం ఎలా చేయాలో చెబుతూ, 'మహాత్ముల జీవితాలను వారి సందేశాలను చదువుతున్నప్పుడు వాటిని నైతిక, ఆధ్యాత్మిక విలువల దృష్టితో చదవాలి. వాటిని మన జీవితంలో ఆచరించడానికి ప్రయత్నించాలి' అంటారు.

తరువాత ఓంకార ప్రణవ ధ్యానం. అంటే ఓంకార ధ్యానాన్ని కూడా స్వాధ్యాయంగా చెబుతారు. గురువు ద్వారా పొందిన మంత్రాన్ని ఉదయం, సాయంకాలాల్లో జపించడం కూడా స్వాధ్యాయమే.

స్వాధ్యాయం ముఖ్యోద్దేశం

కేవలం విషయాన్ని తెలుసుకోవడానికి మాత్రమే శాస్త్రాధ్యయనం. అంతేకానీ దాని ద్వారా బ్రహ్మజ్ఞానాన్ని పొందలేం. 'పంచాంగంలో ఇంత వర్షం కురుస్తుంది అని ఉంటుంది కానీ దాన్ని పిండితే ఒక్క నీటి బొట్టు కూడా రాలదు' అంటారు శ్రీరామకృష్ణులు.

భక్తి గ్రంథాలు, వేదాంత గ్రంథాలు మనస్సును ఉన్నత స్థాయిలో ఉంచడానికి సహాయపడతాయి. దాని కోసం స్వాధ్యాయం అవసరం.

కేవలం శాస్త్రపాండిత్యమే లక్ష్యంగా చదివే పండితుల గురించి శ్రీరామకృష్ణులు చెబుతూ, ఆకాశంలో ఎత్తున ఎగురుతున్న గ్రద్దను ఉదహరిస్తారు. అది ఆకాశంలో ఎగురుతున్నప్పటికీ దాని దృష్టి మాత్రం క్రింద పడి ఉన్న శవాల మీదనే ఉంటుంది.

భగవంతుడే అన్నింటికీ మూలం అని తెలుసుకోవడమే శాస్త్రాధ్యయనం. ఎన్ని సున్నలు ఉన్నప్పటికీ ఎడమ ప్రక్కన ఒకటి లేకపోతే ఆ సున్నలకు ఏ విధంగా విలువలేదో అదే విధంగా భగవంతుడు లేకపోతే జీవితానికి విలువ లేదు. ఆయన ఒక్కడే సత్యం! అది తెలియజేయడమే శాస్త్రాధ్యయనం ముఖ్య ఉద్దేశం!

నేటి యువతరానికి వివేక భావజ్వాల!

“ఎక్కడైతే హృదయాంతరాళాల నుంచి మాటలు వెలువడతాయో ఆ మాటలకే జీవితాలను మార్చగల శక్తి ఉంటుంది”అని 'గీతాంజలి'లో రవీంద్రనాథ్ టాగూర్ అంటారు. ఆ మాటలే స్వామి వివేకానంద భావజ్వాల. ఆయన జ్ఞానాగ్నిలో ఒక కణంగా మారగలిగితే – అంటే ఆయన భావాలతో నిండిన 'లేవండి! మేల్కొండి!' పది సంపుటాలలో కొంచెమైనా ఆకళింపు చేసుకోగలిగితే అదే నిజమైన స్వాధ్యాయం. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్ లాంటి ఎందరో నాయకులకూ, బిల్‌గేట్స్, సుకర్ణో, అన్నా హజారే వంటి నేటి ప్రముఖులకూ స్ఫూర్తిని ఇచ్చింది వివేకానందుని భావజ్వాలే! ❖

'విశ్వాసం.. విశ్వాసం' అదే స్వామీజీ సందేశం!

– కామూర్తి వెంకటేశ్

నా పేరు కామూర్తి వెంకటేశ్. మా ఊరు అనంతపురం జిల్లా రాయదుర్గం. నేను రెడీమేడ్ గార్మెంట్స్‌లో కటింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్నాను.

గత సంవత్సరం వేసవి సెలవులలో మా అబ్బాయిని స్వామి వివేకానంద బాల వికాస కేంద్రానికి పంపే అవకాశం కలిగింది. అప్పుడు ఆ 'వివేకానంద బాల వికాస కేంద్రం' తరగతులను నిర్వహించిన స్వామీజీ అర్చనానంద గారు పరిచయం అయ్యారు. స్వామీజీ సలహా మేరకు నేను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుడనయ్యాను. 'శ్రీరామకృష్ణ ప్రభ' చదవడం వల్ల శ్రీరామకృష్ణులు, శ్రీశారదా మాత, స్వామి వివేకానందుల గురించి తెలుసుకోగలిగాను. స్వామి వివేకానందుల గురించి ఇంకా ఎక్కువగా తెలుసుకోవాలన్న ఆసక్తితో స్వామీజీ జీవిత చరిత్ర 'స్వామి వివేకానంద' (2 సంపుటాలు) చదవడం ప్రారంభించాను. స్వామీజీ జీవితంలోని సంఘటనలను చదివినకొద్దీ నాకు ఆసక్తి పెరిగింది. దీంతో వివేకానందుని గురించి అందరూ తెలుసుకోవాలన్న ఉద్దేశంతో నన్ను కలిసిన వారందరికీ స్వామీజీని గురించిన పుస్తకాలు చదవాల్సిందిగా చెబుతుంటాను. ఎందుకంటే స్వామీజీ సేవాభావం, త్యాగనిరతి అందరిలోనూ కలగాలన్నది నా ఆశ.

స్వాతంత్ర్య సమరయోధులైన సుభాష్ చంద్రబోస్ గారు, స్వామీజీ సంభాషణలతో ప్రభావితమయ్యాననీ, శ్రీరామకృష్ణులు, స్వామి వివేకానందుల సాహిత్యం యువకులను చైతన్యం చేయగలదనీ కూడా చెప్పారు. మహాత్మా గాంధీ కూడా స్వామీజీ సాహిత్యాన్ని చదివి ప్రభావితం అయ్యానని చెప్పారు. అంతటి వారినే ప్రభావితం చేసిన స్వామీజీ సూక్తులు మనల్ని ఆకట్టుకోవడంలో ఆశ్చర్యం లేదు. అలాగే నన్నూ స్వామీజీ సూక్తులు ప్రభావితం చేశాయి. వాటిలో నన్ను బాగా ప్రభావితం చేసినవి: "విశ్వాసం! విశ్వాసం! మన మీద మనకే విశ్వాసం. దేవుని మీద విశ్వాసం. ఇదే గొప్పతనంలోని రహస్యం. మీ పురాణాలు వర్ణించిన ముప్పై మూడు కోట్లమంది దేవతల మీద మీకు విశ్వాసం ఉన్నా, అప్పుడప్పుడూ విదేశీయులు మీ మధ్యలోకి చొప్పించిన దేవతలందరి మీద కూడా మీకు విశ్వాసం ఉన్నా, మీ మీదనే మీకు విశ్వాసం లేకపోతే మీకు మోక్షం లేదు".

స్వామి వివేకానంద సాహిత్యాన్ని చదవక ముందు ఏదైనా ఒక విషయం గురించి నేను ఆ పని చెయ్యగలనా, లేదా; చేస్తే రాణించ గలనా అని పలురకాలుగా ఆలోచించేవాణ్ణి. చివరకు దైవం ఏది తలిస్తే అది జరుగుతుందిలే అనుకుని వెనుకడుగు వేసి, దాని గురించి ఆలోచించేవాణ్ణి కాను. కానీ స్వామి వివేకానందుల సాహిత్యాన్ని చదివిన తరువాత నాపై నాకు విశ్వాసం పెరిగింది. ఏదైనా పని చేయాలి అనుకుంటే దాన్ని చేసేవరకు విడిచిపెట్టకుండా చేస్తున్నాను. చివరకు ఎంత శ్రమించి అయినా సరే దాన్ని సాధించడం అలవరుచుకున్నాను.

స్వామీజీ ఆశయసాధనకు తోడ్పడాలన్న భావంతో నా వంతు సహాయంగా అవకాశం కలిగినప్పుడు స్వామీజీ సాహిత్య ప్రచారంలో పాల్గొంటున్నాను. ❖

కామూర్తి వెంకటేశ్, రాయదుర్గం, అనంతపురం జిల్లా

With Best Compliments From

K S N SARMA (In memory of Smt. KAPAVARAPU JANAKI DEVI)

H.No.5-43/15/71, P.S. Rao Nagar, Dammaiguda, Hyderabad - 500 083

'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను మెదక్, కృష్ణా జిల్లాలలోని 1000 పాఠశాలలకు ఒక సంవత్సరానికీ, మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లోని 107 కళాశాలలకు మూడు సంవత్సరాలకూ స్పాన్సర్ చేశారు.

నిత్య సంతోషం

- స్వామి రంగనాథానంద

సంతోషంగా ఉండాలని అందరూ కోరుకుంటారు, అందుకోసం భౌతికంగా ఎన్నో సౌకర్యాలు, సుఖాలు ఏర్పరుచుకుంటారు. కానీ నిత్యం సంతోషం ఎలా పొందాలో తెలుసుకోలేరు. అంతరంగంలోని దివ్యత్వాన్ని దర్శించగలిగితే ఆనందం అదే వస్తుంది. ద్రవ్యత్వం నుంచి దివ్యత్వం వైపు సాధన చేస్తూ ఆత్మస్వరూపం అవగాహన చేసుకునేవారికి అంతరంగం నుంచి నిత్య సంతోషం లభిస్తుంది. భగవద్గీత ఒక సాంకేతిక విజ్ఞాన శాస్త్రం లాంటిది. మానవుణ్ణి జంతు స్వభావం నుంచి దివ్యత్వానికి మళ్ళించే ఒక గొప్ప దివ్య గ్రంథం. మానవజాతి స్వేచ్ఛగా తిరిగే విధానాన్ని భగవద్గీతలో భగవంతుడు వివరించారు. "మన్-హుష్ అయినవారు మానుష్" అని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. "మానుష్ ఎవరు? మన్-హుష్ అంటే ఎవరి మనస్సు సంతోషంగా ఉంటుందో వారు మానుష్. బలం అంతా అతని మనస్సులోనే ఉంటుంది. సాధనతో మానసిక బలాన్ని పెంచుకోవాలి. మాటపడాల్సి వచ్చినా, మాట చెల్లుబాటు కాని పరిస్థితి ఎదురైనా మానసికంగా కుంగిపోకుండా మనస్సును దృఢపరుచుకోవాలి. మన శరీరంలో రోగక్రిములెన్ని ఉన్నా, శరీరం బలంగా ఉంటే అవి ఏమీ చెయ్యలేవు. శరీరంలో బలం తగ్గినప్పుడే అవి విజృంభించి, అనారోగ్యం పాలు చేస్తాయి. అలానే మనస్సు దృఢంగా ఉన్నపుడు బయటి పరిస్థితులు మనల్ని కుంగదీయ లేవు.

ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే
ప్రసన్న చేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే *(గీత 2.65)*

ప్రతిజీవీ ఆనందాన్ని కోరుకుంటాడు. అదెలా సాధ్యమో భగవాన్ శ్రీకృష్ణుడు ఈ శ్లోకంలో బోధించాడు.

మనస్సు నిర్మలమైతే ఆనందం తప్పక లభిస్తుంది. 'ప్రసాదం' అంటే మనోనైర్మల్యం. నీకు 'ప్రసాదం' లభ్యమైనట్లయితే జీవితంలో దుఃఖాలన్నీ తొలగిపోతాయి. ఏ విషయాలూ మనల్ని కదిలించవు. ఒక్కొక్కసారి చాలా సామాన్యులలో కూడా మనం ఇలాంటి స్థిరబుద్ధిని చూస్తుంటాం.

'ప్రసన్న చేతసోహ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే' - మనస్సులో ప్రసన్నత ఉన్నవారికి ఎలాంటి అలజడీ, దుఃఖం కలగవు. నిర్మలమైన మనస్సు బుద్ధి యందు నిశ్చలంగా ఉండగలదు. అన్ని కార్యక్రమాలనూ నిర్వహిస్తూ, చాలా శాంతంగా నిర్మలంగా ఉండవచ్చు. నిర్మలమైన, ఆనందమైన, స్వేచ్ఛాయుతమైన మనస్సును 'ప్రసాదం' అంటారు. నీరు పరిశుభ్రంగా ఉంటే 'ప్రసన్న' అంటారు. శారీరక - మానసిక, ఇంద్రియ జ్ఞాన నిర్మితమయిన వాటినన్నిటినీ కచ్చితమైన రీతిలో

అధీనంలో ఉంచుకోవడం వల్ల మనకు శాంతి లభ్యమవుతుంది.

నీకు మనశ్శాంతి కావాలంటే ఇతరుల తప్పులను ఎంచకు అని శారదామాత బోధించారు.

మనస్సు, మాట ఒకటైతే మనశ్శాంతి లభిస్తుందని శ్రీరామకృష్ణులు చెప్పారు.

నిర్మలత్వం, పరిపూర్ణత ఉన్నప్పుడే సంతోషం లభ్యమవుతుంది. సంతోషం కావాలంటే మనస్సును వశంలో ఉంచుకోవాలి. మనస్సుకు శిక్షణ నిచ్చుకోవడం ద్వారా సమన్వయాన్ని సాధించవచ్చు.

నిత్యజీవితంలో ప్రేమపూర్వకంగా ఉండడం, నిన్ను నువ్వే కాక, నీ కుటుంబాన్నీ, పరిసరాలనూ ప్రేమించడం జీవన వైఖరిగా చేసుకోవాలి. ❖

సేకరణ: ఆర్. కృష్ణ

... 17వ పేజీ తరువాయి.


9
సరైన సమయానికే వచ్చావు నాయనా! ఈ విగ్రహాన్ని కొంతసేపు నువ్వు పట్టుకో. నేను స్నానం చేసి, అనుష్ఠానం ముగించుకుని వచ్చి దాన్ని మళ్ళీ తీసుకుంటాను.
సరే! అలాగే చేస్తాను.
మహారాజా! నేను బాలుణ్ణి! దీన్ని ఎక్కువసేపు మొయ్యలేను. అందువల్ల నేను మిమ్మల్ని మూడుసార్లు పిలుస్తాను. ఆ లోపల మీరు వచ్చేసేయాలి. లేకపోతే నేను దీన్ని కింద ఉంచాల్సి వస్తుంది.
10
విభీషణుడు కావేరీ జలాలలో చాలాసేపు ఆనందంగా స్నానం చేశాడు. ఇంతలో ...
మహారాజా! ఈ విగ్రహం చాలా బరువుగా వుంది. మహారాజా! మహారాజా!
విభీషణుడికి ఆ పిలుపు వినబడలేదు. అందువల్ల కావేరీ నది రెండుగా చీలి మధ్యలో ఒక దీవిలా ఉన్న చోట ఆ విగ్రహాన్ని పెట్టాడు ఆ బాలుడు.
11
స్నానం చేసి తిరిగి వచ్చిన విభీషణుడు...
ఓరీ! దాన్ని నేల మీద ఉంచకూడదని చెప్పానుగా!
నేనేం చెయ్యను మహారాజా! బరువు మొయ్యలేకపోయాను. నేను మూడుసార్లు పిలిచినా మీరు రాలేదు.
విభీషణుడు ఎంత ప్రయత్నించినా ఆ విగ్రహాన్ని కదిలించలేకపోయాడు.
అందువల్ల ఆ బాలుణ్ణి కొట్టడానికి వెళ్ళాడు. ఆ బాలుడు వేగంగా ఒక కొండవైపు పరుగు తీశాడు.
కొంతసేపటికి విభీషణుడు ఆ బాలుణ్ణి పట్టుకొని, అతని తల మీద మొట్టికాయ వేశాడు.
12
పట్టుబడ్డావా! దుష్టుడా!
వెంటనే ఆ బాలుడు వినాయకుడిగా విభీషణునికి దర్శనమిచ్చాడు. (విభీషణుడు ఆ బాలుణ్ణి మొట్టిన గుర్తు తమిళనాడులోని తిరుచ్చిరాపల్లిలో మలైకోట్టై వినాయకుడి శిరస్సు మీద ఇప్పుడు కూడా చూడగలం.)

ఇప్పటికీ విభీషణుడు ప్రతిరోజూ రాత్రి సమయంలో శ్రీరంగనాథ స్వామిని పూజిస్తాడని అంటారు.

ప్రార్థనలు, పూజలు, జపధ్యాన సాధనలను చేసిన పుణ్యస్థలాల్లో భగవంతుడు నిశ్చయంగా వెలసివుంటాడని గ్రహించు. శ్రద్ధా భక్తుల వల్ల పారమార్థిక భావాలు అక్కడ ఘనీభూతమై ఉంటాయని చెప్పవచ్చు. ఇలాంటి పుణ్యతీర్థాల్లో మానవుడు సులువుగా భగవంతుణ్ణి చూడగలడు. – శ్రీరామకృష్ణ పరమహంస

గ్రంథ పరిచయం

మూకమహాకవి ప్రణీత

మూక పంచశతీ

వ్యాఖ్యాత: దోర్బల విశ్వనాథశర్మ
ప్రకాశికా: రావి కృష్ణకుమారీ
పేజీలు: 876, వెల: రూ. 500/-
ప్రతులకు: రావి మోహనరావు,
4-103, కొత్తపేట, చీరాల-523 157.
మొబైల్ ఫోన్: 9440115411

కంచి కామాక్షీ అమ్మవారి కృపతో మూకకవి భావపారవశ్యంలో రచించిన 'మూకపంచశతీ' అనే సంస్కృత గ్రంథానికి 'సారోల్లాసినీ' వ్యాఖ్య పేరుతో దోర్బల విశ్వనాథ శర్మగారు ఆంధ్ర ప్రతిపదార్థ తాత్పర్య వివరణ కావించారు. తాత్పర్య వివరణలో ప్రతి శ్లోకంలో ఉన్న అలంకార లక్షణాలను, ప్రాసలను, వర్ణ మైత్రులను తెలియజేసి వ్యాకరణ విశేషాలను కూడా విశదపరిచారు. శర్మ గారి తాత్పర్యం, తాత్పర్య వివరణ మృదుమధురంగానూ, గంభీరంగానూ సాగింది. కొన్ని చోట్ల తాత్పర్య వివరణలో శ్లోకం భావార్థ వివరణ కన్నా, వ్యాకరణ విశేషాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు కనపడినా, పుస్తకం మొత్తం చదివినట్లైతే అమ్మవారి తత్త్వాన్ని సమగ్రంగా తెలియజేశారని తెలుస్తుంది. సగుణ సాకార రూపాన్ని నిర్గుణ నిరాకార తత్త్వంతో అనుసంధానం చేస్తూ, భక్త్యావేశంతో మూకకవి రచించిన ఐదువందల శ్లోకరాజాలకు విశ్వనాథ శర్మగారు ప్రతిపదార్థం, తాత్పర్య వివరణను ఇచ్చి తెలుగు ప్రజలకు, ప్రత్యేకించి అమ్మవారి భక్తులకు మహోపకారం చేశారనడంలో అతిశయోక్తి లేదు. విశ్వనాథ శర్మగారి కృషి గొప్పగా ఎంచదగ్గది. అమ్మవారి భక్తులందరూ తప్పక చదువవలసిన గ్రంథమిది. - **ఆనంద**

యజుర్వేదీయ

సంధ్యావందనం



వ్యాఖ్యానం: అప్పరుసు విజయరామారావు
పేజీలు: 107, వెల: రూ. 60/-
ప్రతులకు: ఎ.వి. రామారావు
16-9-750/12, అజంతా కాలనీ,
రేస్‌కోర్స్ రోడ్, ఓల్డ్ మలక్‌పేట్,
హైదరాబాద్-36

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & పక్యాల గిరిజ, డైరక్టర్

SVISS LABSS LTD.,

(Manufacture of Bulk Drugs / Drugs Intermediates)
An ISO 9001 : 2000 Certified Company

No.88-89, Phase - II, Sipcot Industrial Complex,
Ranipet - 632 403, Tamil Nadu.

Web Site : www.svisslabss.com

"Are you growing spiritually? Can you love others? Can you feel oneness with others? Have you peace within yourself? And do you radiate it around you? That is called spiritual growth, which is stimulated by meditation, inwardly, and by work done in a spirit of service outwardly." *- Swami Ranganathananda*

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

ADVT.

'వివేక ప్రభ' దశమ వార్షికోత్సవం

'ఆధ్యాత్మిక పత్రికా రచన ప్రాముఖ్యం'పై గోష్ఠి

గోష్ఠికి హాజరైన స్వామీజీలు, భక్తులు

రామకృష్ణ సంఘ మాసపత్రికల సంపాదకులు, ప్రతినిధులు

మైసూరులోని శ్రీరామకృష్ణ ఆశ్రమం ఆధ్వర్యంలో వెలువడుతున్న కన్నడ మాసపత్రిక 'వివేక ప్రభ' దశ వసంతాలు (2000-2009) పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 2009 జూన్ 27, 28 తేదీల్లో ఘనంగా ఉత్సవాలను నిర్వహించారు.

27వ తేదీన రామకృష్ణ మఠానికి చెందిన వివిధ కేంద్రాల నుంచి ప్రచురితమవుతున్న మాసపత్రికల 'సంపాదకుల సదస్సు'ను నిర్వహించారు. ఈ సదస్సులో 11 మంది పత్రికా సంపాదకులు, ప్రతినిధులు, ప్రముఖ పాత్రికేయులు పాల్గొని 'ఆధునిక సమాజంలో ఆధ్యాత్మిక పత్రికల పాత్ర' అనే అంశంపై చర్చించారు.

28వ తేదీన జరిగిన సదస్సులో 'ఆధ్యాత్మిక పత్రికా రచన ప్రాముఖ్యం' అనే అంశంపై గోష్ఠి జరిగింది. ఈ సదస్సులో చెన్నై రామకృష్ణ మఠాధ్యక్షులు స్వామి గౌతమానందజీ, కోయంబత్తూర్ రామకృష్ణ మిషన్ విద్యాలయ కార్యదర్శి స్వామి ఆత్మారామానందజీ, కడప రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి ఆత్మవిదానందజీ, నాగపూర్ రామకృష్ణ మఠాధ్యక్షులు స్వామి బ్రహ్మస్థానందజీ, ప్రముఖ అర్థశాస్త్రవేత్త శ్రీ ఎన్. గురుమూర్తి, ప్రముఖ మానవీయ శాస్త్రవేత్త డా॥ ఎన్.ఎస్. రాజారామ్, ప్రముఖ రచయిత - ప్రయోక్త శ్రీ రాజీవ్ మెహ్రోత్రా, ఇతర ప్రముఖ పాత్రికేయులు, పుర ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సులో సుమారు 400 మంది భక్తులు పాల్గొన్నారు. మైసూర్ రామకృష్ణ ఆశ్రమం అధ్యక్షులు స్వామి నిత్యస్థానందజీ వందన సమర్పణతో 'వివేక ప్రభ' దశమానోత్సవాలు విజయవంతంగా ముగిశాయి.

'రామకృష్ణ సంఘం' ప్రచురిస్తున్న ప్రధానమైన మాసపత్రికలు

❖ నివేదిక: స్వామి వీరేశానంద

భక్తులకు మంత్రోపదేశం

రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్‌ల ఉపాధ్యక్షులు **పూజ్య స్వామి స్మరణానందజీ మహరాజ్** 2009 సెప్టెంబరు 9 నుంచి సెప్టెంబరు 23వ తేదీ వరకు హైదరాబాద్ రామకృష్ణ మఠంలో బస చేస్తారు. ఆసక్తిగల భక్తులకు **సెప్టెంబరు 13,16,18,20**వ తేదీల్లో పూజ్య స్వామీజీ మంత్రదీక్ష ప్రసాదిస్తారు. మరిన్ని వివరాల కోసం: **స్వామి జ్ఞానదానంద, అధ్యక్షులు, రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029**ను సంప్రతించవలెను.

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

1. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది కోర్సులకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) 'వేదచూడామణి' : ఋగ్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క అధ్యయనము

యోగ్యతలు : మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.

వయస్సు : 8 నుంచి 10 సంవత్సరాల మధ్య

స్టైఫండ్ : నెలకు రూ. 1,000/-

(ఆ) 'వేదార్థచూడామణి' : ఋగ్వేదము/ యజుర్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము

యోగ్యతలు : సంస్కృత పరిజ్ఞానముతో బాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.

వయస్సు : 15 సం॥, ఆ పైన

స్టైఫండ్ : నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) వేదాధ్యాపకుడు : (సామవేదము/ అథర్వవేదము – వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)

కావలిసిన అర్హతలు : క్రమాంతము లేక పదాంతము

అదనపు అర్హతలు : ఏదైన మఱియొక వేదము/ వేదభాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము

అనుభవము : 2 సంవత్సరములు

సంభావన : నెలకు రూ॥ 8,000/- మొత్తము, సౌకర్యములతో

(ఆ) వేదభాష్యాచార్యుడు : (ఒక్కొక్క వేదానికి ఒక్కొక్కరు చొప్పున 4 ఖాళీలు)

విద్యార్హత : ఏదైనా వేద భాష్యంలో ఉత్తీర్ణత

అదనపు అర్హత : మరొక వేద భాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము

అనుభవార్హత : 5 సం॥

సంభావన : నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన దరఖాస్తు ఫారములను **శ్రీ పి. వేంకటేశ్వర్లు గారు, మేనేజింగ్ డైరెక్టర్, కాకతీయ సిమెంట్, సుగర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్, 'గురుకృప' (ఆంధ్రా బ్యాంకు ఎదురుగా), 1 - 10 - 140/1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 500 020** (ఫోను: 040 – 27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టు ద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ఆ ముద్రిత దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్ని బట్టి ఖాళీలను పూరించుట లోనూ, అర్హతల సవరణ లోనూ మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

సం/-

హైదరాబాద్

కులప్రశాసకుడు

Sponsored by:

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1 - 10 - 140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad - 500 020
Ph: 2763 7717, 2763 3627, Fax No. 040-27630172, Email: info @ kakatiyacement.com

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**